# తగిలినవేలికే తగులుతుంది

(రెండో భాగం *)

వేలాల సుబ్బారావుగారు

శ్రీ లెక్చరుగారు శిక్ష వినిపించిన యనంతరం సాభసాను లోహనిర్మితహస్తకంకణాలంకరణపూర్వకంగా మద్రాసులో పశ్చాత్తాపమందిరాని (Penitentiary) కి తీసుకొనివచ్చారు నలుగురు సాయుధులైన ఇతనిపూర్వపు ఒహోదీయులు అనవసరవు దండుగచేటు కట్టుదిట్టాలన్నింటితో. ఈపెనిటెన్షియరీలో కొంతకాలం తరిఫీతు నొందినపిదప వేలూరు సెంట్రల్ జయిలుకు రవాణా చేయవలసిందని జైళ్ల ఇన్స్పెక్టర్ జనరల్ గారి యుత్తరువు. రాజధానిలో అక్కడక్కడ ధర్మసంరక్షణార్థాయ నెలకొల్పబడిఉన్న కేంద్రకారాగారాల (Central Jails) కన్నింటికీ ఈపెనిటెన్షియరీ ఒక తరిఫీయత్ సంస్థ (training institution) వంటిది. ట్రెయినింగు సంస్థలలో తరిఫీతు నందిన యల్. టీ., బీ. టీ. లకు బాలికా బాలకులసంస్కారశాల(Schools & Colleges)ల్లో మెలగడానికి జ్ఞానానుభవయోగ్యతలు కలిగేలాగున పెనిటెన్షియరీలో తరిఫీయతును పొందిన పీ-టీలకు (Prisoners Trained) కూడా మానవసంస్కారశాలల్లో (కారాగృహాల్లో) మెలగడానికి జ్ఞానానుభవయోగ్యతలు కలుగుతాయి. బీ-టీలకూ పీ-టీలకూ పదవిభేద ముండనీండిగాక. పాపం మనస్వామిభక్త సార్జెంటుకు పూర్వపదాలకన్నింటికీ భ్రంశం కలిగినపుడు మన మీ 'సాభసా' పదాన్నిమటుకు వేటాడడం ఎందుకూ? వీరయ్య అని ఇతని అసలు పేరునే ఇఖనుంచి వాడుకొందాం.

మద్రాస్ సెంట్రల్ స్టేషన్ వద్ద రైలు దిగి రక్షకభటచతుష్టయ పరివృతుడై ప్లాటుఫారంమీద పనిడికతిరిగే ప్రయాణీకుల ఉత్కంఠా పూర్ణదృష్టులనూ, పనిలేక తిరిగే సోమరిపోతుల మందావలోకాలనూ, తనవైపునకే ఆకర్షించుకొంటూ, వీరయ్య నడచి బయటకు వచ్చి అక్కడ నదివరకే తనస్వాగతార్థం వచ్చి కనిపెట్టుకొనియున్న పోలీసులారీ నెక్కి పెనిటెన్షియరీవద్ద చేగాడు. ఎస్కార్టుతో బందు లారీలోపలగూడా కాచుకొనే నిలుచున్నారు పోలీసుమూతలు వీరయ్యను. జైలుముందు లారీ ఆగంగానే దాన్నుంచి ముగ్గురుమూతలుదిగి ప్రక్కనే వున్న పోలీసుకచేరీలోనికి వెళ్లారు. అనంతరం ఇతనికి జెందిన కాగితాల నన్నింటిని భద్రంచేసికొని మిగిలిన మూత ఒక్కడూ ఇతన్ని నడిపించుకొనిపోయి పెనిటెన్షియరీ మొదటిగేటును దాటించినాడు. ఆగేటు దాటి లోపల కాలు పెట్టడంతోటే ఆరంభమైంది జైలుతంతు.

ముందు కొంతతంతు జరక్కుండా శుభమో, అశుభమో ఏకార్యమూ సంపన్నం కాదు. నిజానికి కారాగారం కాశీరామేశ్వరాలవంటి ఒకమహాతీర్థక్షేత్రం. ఎల్లప్పుడూ అక్కడే నివాస మేర్పర్చుకొని వుండే తీర్థసంవాసులకు దప్ప కొత్తగా వచ్చే యాత్రికులకు ఎటువంటివారికైనా పుణ్యతీర్థాల్లో వున్నంతకాలం మనస్సులో దుశ్చింతనలు కాని, పాపవాసనలు గాని జనించవు. అదేవిధంగా జయిలుకు వెళ్లిన కొత్తఖైదీలకుకూడా మనస్సు నిష్కల్మషంగా వుండి సదభిప్రాయాలే పుట్టుతూ వుంటాయి. ఇది కాక ఈరెండిట్లో గల మరో సాదృశ్యం ఏమిటంటే, శిరోముండనం. కేశవపనం ఈరెండు రకాల పవిత్రస్థానాల్లో జరుగుతుంది. "కింత్వేతయోః కించిన్మాత్ర విభేదో వర్తతే. ఐచ్ఛికానైచ్ఛిక భేదాత్. వృద్ధవిధవా బాలరండయోః క్షౌరవదితి" కల్పితచాణక్య స్మృతికారుని వాక్యానుసారం, పుణ్యక్షేత్రాల్లో యాత్రికులు తమంతటదామే మోజుపడి క్షవరం చేయించుకొంటూవుంటారు, కాని నాకు వద్దో మొర్రో యని ఏడుస్తున్నా బలవంతాన్ని బట్టి గొరిగిస్తూ ఉంటారు జయిలు క్షేత్రాల్లో. లేకపోతే నూనే, కుంకుడుకాయలకే దండగ్గా తగలెయ్యాలిసి వచ్చేది ఏఅత్యంతావసరమైన భారతీయరక్షక సైనికవ్యయ

* దీని మొదటిభాగము అశ్వీయుశమాసము (అక్టోబరు, ౧౯౩౭) సంచికయందు ప్రకటితము.

సద్వినియోగానికో పనికివచ్చే లక్షలకొలది ద్రవ్యరాశినీ. దానికి తోడు ఈకారాగావాసం ఒకవిధమైన సంస్కారం. దీనివలన పశ్చాత్తాపం, జ్ఞానం కలిగి మానవునిలో కొంత పరివర్తనం గలిగితీరుతుంది. కాబట్టి ఇది సప్తదశసంస్కారమని లెక్కించుకోవచ్చు. ఈప్రకారం పుణ్యతీర్థ సంస్కార సమ్మేళనస్థానం కావడంచేత జైల్లోకూడా జరిగి తీరాలి కొంతతంతు. జరుగుతుంది కూడాను. ఇది యొక విలక్షణమైన తంతు. కొన్ని సంవత్సరాలక్రిందటి వరకూ, ఎవరికో కొందరికి పుణ్యాత్ములకు దక్క సర్వసాధారణంగా అందరికీ లభించేది కాదు ఈతంతు సంబంధమైన జ్ఞానం. ఇటీవల నూతనంగా బ్రిటిష్ ఇండియా ప్రభుతాసతీమతల్లీ కాచించిన నోములపంట, ఆమె సలిపిన పుణ్యదానోపవాసాదుల ఫలం ఏకీభవించి సుకుమారకుమారరూపంతో మనదేశమునం దవతరించివున్న సంగతి భారతీయుల కందరికీ తెలిసిన విషయమే. కుమారబ్రువుని భావికార్య నిర్వహణశక్తిని బాగుగా గుర్తించే జననీ జనకులితనికి లాఎండ్ ఆర్డ రని శుభనామకరణం గావించారు. ఆహా! ఏంపిల్లవాడనుకొన్నారూ? చిచింద్రీ. చిచింద్రేమిటీ! విద్యుత్ కణం, పిడుగు. దానికి తోడు దుర్భేద్యాలైన ఆర్డినెన్సు కవచాలతో జననం. ఇకేంకావాలీ! మహాభూకంపం భూమిని ఊటాడించినలాగు పుట్టీపుట్టడంతోటే గజగజలాడించేడు ఆసేతుహిమాచలం భారతవర్షాన్ని. ఇది మహాపురుష లక్షణం. మహానుభావు పుట్టినపుడల్లా అలౌకిక భౌతికఘటనాలుసంభవిలుస్తూఉంటాయి. రెండేడ్లయినా దాటాయో లేదో, ఆగర్భశ్రీమంతులకు, అసూర్యంపశ్యలకూ, అపూర్వస్తనంధయులకు, అశీతివర్షప్రాయులకు కృష్ణజన్మస్థానావాససౌభాగ్యం అనాయాసంగా లభించేలాగు చేశాడు లింగవయోజాతి వివక్షత లేకుండా వత్సే. విలక్షణ దివ్యయోని సంభూతుడు కావడంచేత నాచిట్టి తండ్రికి ఆరునెల్ల కొకపర్యాయం కాయపరివర్తనం కూడా లభిస్తూ ఉంటుంది. ఈకాయపరివర్తన సమయాల్లో కుక్షింభరులూ, వివేకశూన్యులూ నైనభారతీయులనేకులు......ఏమని వ్రాసేది...మహాఘోరం... ఆవాచ్యం! శిశుహత్యాపాతకమే అని అయినా గణించక, కుమార శ్రీని స్వాహాదేవికి సమర్పించి కన్నతల్లిని దీరని పుత్రశోకంలో ముంచాలని ప్రయత్నించారు. కాని జననకర్తలుఅసహాయశూరులు కావడంచేతవీరియాట లేమి సాగివచ్చాయి కావు. ఆధునిక సమగ్రవిజ్ఞానరహస్య పరిజ్ఞాతలైన జననకర్తలు కవచాలను పునఃసంస్కరించి వత్సను చిరంజీవిగా చేశారని వ్రాయడానికి నాకు అపరిమితానందంగా ఉంది. కావలసినంతకాలం మనిఉండేలాగు చిరంజీవిని నేనుకూడా దీవిస్తా, భారతీయులందరి తరఫునా: వత్సా, చిరం జీవ! చిరం జీవ!

లాఎండార్డరుకుమార జన్మా
ఖ్యానంభక్తి పఠించినవారికి
వినువారికి వినుపించెడువారికి
గల్గు నిత్య సౌఖ్యాయు రున్నతుల్.

ఇతి శ్రీ తగిలినవేలికే తగులుతుంది కథానకే ద్వితీయభాగే కుమారశ్రీలాయం డార్డర్ జన్మకథనం నామ పుణ్యసంకీర్తనం సంపూర్ణం. శ్రీకృష్ణార్పణమస్తు... క్షమించాలి సుమండీ! కుమార నామ స్మరణ సంజాత మహానందం చేత మిమ్మల్ని ప్రసంగాంతరంలోకి దించాను. కాని నాయీ కథాసంవిధాన సందర్భాలే అటువంటివి. మిమ్మల్ని ఇటూ అటూ పరుగెత్తించాలనే వస్తుంది. కాబట్టి అన్నింటికీ ఒక్కమాటే క్షమాపణ కోరుతూ మీపుణ్యమా యని రవంత ఓపికపట్టి వుండాలిసిందిగా ప్రార్థిస్తాను, దారి తప్పించి పరుగెత్తించినపుడంతా.

ఇంతకూ చెప్పవచ్చిం దేమిటంటే, కుమారశ్రీ అనుగ్రహంవల్ల ఇప్పుడు కారాగారపుతంతూ మొదలైనవాటినిగురించి చాలామందికి తెలిసేవుంటుంది కాబట్టి విస్తరించి వ్రాయవలసిన అవసరమే లేదు.

మొదటిగేటు దాటడంతోటే వీరయ్య వెంట వచ్చినదూత ఇతనికి జెందిన కాగితాల నన్నింటినీ, అనగా కలెక్టరుగారి శిక్షావిధానం, శిక్షాకాలం, ఇత్యాదుల గురించి వ్రాయబడివుండే కాగితాలను, అక్కడప్రక్కగా నున్న లేఖకునిపరం జేసి వెళ్లిపోయినాడు తరువాత ఇతని దగ్గరవున్న వస్తువులను అన్నింటినీ దాఖలు చేయిం

చుకొని వార్డరొకడు ఇతని కట్టుబట్టలను తుణ్ణంగా సోదాచేసి పరీక్షించినాడు. అంటే ప్రాణాపాయం కలుగచేసికోడానికి వుపయోగపడే పనిముట్లేవీ దగ్గర లేకుండా చేయడానికి లేండి ఈపరీక్ష. ఏవంత నిర్బంధ పరచి బాధపెట్టి ఏదోవిధంగా ఖైదీని మంచిమార్గంలోకి తేవాల్నని కాని అధికారుల అభిమతం, అతనిప్రాణా లను తీయాలినని కాదు. అటువంటి ఉద్దేశమే వుంటే ఒక్క సెకండులో ఎగరగొట్టగలరు కొబ్బరి పుచ్చెల్లాగ వేలకొలది తలకాయలను. కాబట్టి మనుష్యుని ప్రాణం దీయడం కాదు, అతన్ని సన్మార్గగామిగా చేయడం అధికార్ల ముఖ్యాభిప్రాయం. అందుకోసం ప్రాణం పోకుండా వుండాలి, బాధను అనుభవిస్తూ ఉండాలి ఖైది. గరుడపురాణంలోని వ్రాతలనుబట్టి యమలోకాఫీసర్లుకూడా ఇట్టి ప్రాణాపాయం గలుగని పద్ధతినే యవలంబిస్తూ ఉంటారని తోస్తుంది. అంటే, బాధపడుతూ ఉన్నప్పటికీ ప్రాణం పోకుండా ఉండాలి. అందువల్ల అక్కడ జీవుడికి పాపమోచనం, ఇక్కడ మానవుడికి దోషమోచనం; అక్కడ పుణ్యభాగిత్వం, ఇక్కడ సన్మార్గ భాగిత్వం కలుగుతూ ఉంటుంది, జీవుడికీ, మానవుడికీ పరేహలోకాల్లో. అక్కడ లింగశరీరం లభించడంచేత జీవుడికి సోదాచేయించుకోవలసిన యవసరం లేదనుకొంటాను. ఇక్కడ ఆలాటి సదుపాయా లేమీ లేక పోవడంచేత ప్రాణాపాయం గావించుకొని ఆత్మహత్యా మహాపాతకాని కెర కాకుండా ఖైదీని కాపాడడం నిమిత్తం అతనిదగ్గర అట్టిపనిముట్లేమీ లేకుండా చేస్తుంటారు జయిలు అధికారులు. ఎంతటి పుణ్యాత్ములో చూశారా? చాకులూ, కత్తెరలవంటి వానిమాట అట్లా వుండ నీయండి, చివరకు పెన్సళ్లూ, టూత్ బ్రష్షులనుకూడా ఉండనివ్వరు. ఈప్రకారం ఖైదీని సన్మార్గంలోకి దీసుకొనిరావాలినని ప్రయత్నిస్తూ ఒకవేపు, మరోవేపు అతన్ని దుర్వ్యసనాలనుంచికూడా తప్పించి వుంచాల్నని చాలా కష్టాలు పడుతూ ఉంటారు పాపం జైలు నిర్వాహకులు. అందునిమిత్తం మహాతీక్ష్ణంగా సంశోధించి వార్డర్లు వోళ్లల్లోనుంచీ, చంకల్లోనుంచీ, చివరకు బొడ్డుకిందినుంచికూడా బయటికి లాగుతూ ఉంటారు చుట్టపిక్కల్నూ, సిగరెట్టు బీడీల ముక్కలన్నూ, పొడుంపొట్లాలనూ. పాపం న స్యపువేతగాడికి ప్రాణం దీస్తానంటే అంతచింతా, భయమూ కలుగుతుందో కల్గదో కాని రొంటినుంచి పొడుంపొట్లం లాగుతూ ఉంటే మాత్రం పంచప్రాణాలు నిలువున ఎగిరిపోతాయి. పిచ్చెక్కిపోతుంది. పొడుం బొడ్లో వుంటే అంత పిచ్చిగా వుండదు. లేకుంటే మరింతపిచ్చి దీంతగలెయ్యా. అట్లాంటప్పుడు నిండుపొట్లాన్ని లాగుతూవుంటే ప్రాణాలు పోవూ? మైకం కమ్మి వొళ్లు తెలియకుండా కింద పడిపోతాడు. మళ్లీ ఏవార్డరు దయాదాక్షిణ్యాలచేతనైనా ఒక్క చిటికెడుపొడుం ఘ్రాణరంధ్రాల్లోకి ఎక్కితేనే కాని మన లోకంలోకి రాడు. తరువాత తరువాత ఏమైనా కానీండి, ముందు సోదా మాత్రం జరుగకపోదు. సోదా యావత్తూ జరిగినపిమ్మట లేఖకుడు వేరొక వార్డరుపరం చేయగా అతనితో కలిసి రెండోగేటు దాటాడు వీరయ్య.

కావడాని కితడుకూడా పోలీసు నౌకరీ చేసిన మనిషే. కాని ఇతని కింతవరకూ టెక్‌షియరీవంటి పెద్ద సంస్థలను చూడదగిన అవకాశం లభించింది కాదు. అందుచేత ఇతని కంతా కొత్తగా కన్పడడమే కాక ఇక్కడి వ్యవహారాలన్నీ అవగాహనం కాను కాను ఇతనియందంతకు పూర్వమే ఆరంభమైన మార్పు మరింత వేగంతో వృద్ధియౌతూ పోయింది.

చిన్నతనంలో ఎప్పుడో తెలుగుభాషాంతరీకరణాల్లో చదివివున్న తిలస్మీకథలూ, అరేబియన్ నైట్సు కథలూ ఇతనిహృత్పటలంమీద తాండవంచేయసాగాయి. ఖైదీల సంఖ్యనుబట్టి బంతికి ఇద్దరూ, ముగ్గురూ, నల్గురూ, అయిదుగురేసిచొప్పున అనేక పంక్తులుగా దీరి వార్డర్లు ముందు దారి చూపుతూ ఉంటే ఖైదీలు ఒకచోటినుంచి మరొకచోటికి వస్తున్నారు, పోతున్నారు. పొట్టీ పొడుగూ లాగులవారు, తెలుపు ఎరుపు నలుపు మూడు రంగుల టోపీలవారు, తెల్లని హాటు, బూటు, కోట్లవారు బార్లు దీరి రావడం పోవడం మహావిచిత్రంగా గన్పించింది ప్రథమదర్శనంలో. పిదప ఇతడు జైలర్ ఆఫీసుముందు నిలుచోని ఉండగా డాక్టర్ వచ్చి కొలిచి, తూనిక

ఎంతఎత్తు ఉన్నదీ వ్రాసుకొన్నాడు. అనంతరం సూపరింటుగారు వచ్చి ఇతని నామధామాలను రిజిస్టరు చేసుకొని, పైబట్టల దీయించి పుట్టు మచ్చలూ మున్నగు స్వాభావికపు గుర్తులను మార్కు చేసికొని మరో వార్డరుపరం జేశాడు, మర్నాడు ఉదయాన్నే వెరిఫికేషన్ కోసం అక్కడే హాజరు కావలసిం దని వుత్తరువు చేస్తూ. పిమ్మట భోజనపు ఖాతాలో యితని పే రెక్కించడమైంది. తదనంతరం వార్డ రితన్ని వెంట గొనిపోయి జైలుమధుపర్కాలను సమర్పించాడు. మధుపర్క ధారణాత్ పశ్చాత్ పతకసమర్పణం జరిగింది. ఇది బెత్తెడు ఆకారపు జింకుబిళ్ల. దీనిమీద ఖైదీ శెక్షన్ నెంబరు, శిక్షాపరిమాణకాలం అంకితాలై ఉంటాయి. ఇవి కాక ఖైదీ యొక్క తూనికలో గల హెచ్చుతగ్గులను తెలియబరుచు షీట్ ఒకటి ప్రసాదింపబడుతుంది. దీని అభిప్రాయం యేమిటంటే, ఖైదీ జయిల్లో చేరింది మొదలుకొని ఆరోగ్యం కలిగివుంటూ దినాభివృద్ధిని పొందుతూఉన్నా డని పైయధికార్లకు తెలియపరచడానికి. ఎవరైనా జయిలు తనిఖీకి వస్తున్నా రంటే జింకురేకును ఎదురొమ్మునతగిలించుకొనో, లేక మెళ్లో వ్రేలాడగట్టుకొనో, టిన్ రేకుమీద అతికించిన వృద్ధిషీటును రెండు చేతులతో బట్టుకొని ప్రదర్శిస్తూ ఫైల్లో (పంక్తి) నిలుచుంటే ఆ వచ్చిన మహాశయుడు పట్టీ లన్నింటిని చూచుకొంటూ పంక్తియొక్క ఒక చివరనుండి వేరొక చివరవరకు వచ్చి ఖైదీలందరు చాలా ఆరోగ్యంగా చాలా సంతోషంగా ఉన్నారనీ, జైలుఆఫీసర్ల పరిపాలనం మహాతృప్తికరంగా వుందనీ రిమార్కు చిత్తగించి పోతూవుంటారు. ఇది కాక ఒక చిన్నకంచం, గ్లాసూ, కప్పుకొనడానికి గొంగలీ, కింద పరుచుకోడానికి ఒకపట్టా దొరికాయి వీరయ్యకు. కాబట్టి వీరయ్య చాలా అదృష్టవంతుడే అనవచ్చు. ఎందుచేత నంటే, నిజాని కీగొంగళ్లూ పట్టాలు ఖైదీలకందరికీ దొరికి తీరాలిసిందే కాని, ఆర్థికసంబంధమైన లోటుపాటువల్ల ఉపయోగంనిమిత్తం దొరికినా దొరకపోయినా, ప్రతిసోమవారం ప్రొద్దుటిపూట సూపరింటుగారు తనిఖీకి వచ్చినప్పుడూ, ఇన్‌స్పెక్టర్ జనరల్ గారు వేంచేసినప్పుడూ ఫైల్లో అలంకరించడానికి తప్పకుండా ఈవస్తువులను ఏమూలమూలలనుంచో లాక్కొని వచ్చి ఖైదీలముందు హాజరు పెట్టుతు ఉంటారు వార్డర్లు. తనిఖీ పూర్తియై అధికారి అటుమొగం తిప్పడంతోటే ఇటు ఇవీ అంతర్ధానమవుతూ ఉంటాయి, వాటి పూర్వపు కోణాల్లోకే కాబోలు! ఇది ముఖ్యంగా విచారణలో ఉన్న ఖైదీల విషయంలో మాత్రం జరుగుతూంటుంది. వేరోమార్గం లేదు. ఏం చెయ్యాలి? ఎన్ని సమపాయాలకనీ కొట్టుకొంటారు వార్డర్లూ? ఒక్కొక్కమాటు తొంబరుతొంబ వచ్చి పడుతూ ఉంటుంది. విచారణపు వార్డ్లన్నీ (Undertrial wards) ఇట్టి మూకలతో నిండిపోతుంటే వార్డర్ల తరమౌతుందా, వచ్చిన వాళ్లందరికీ పక్క లమర్చడానికి? లేక జైయిల్లో ఏమూలయినా గొంగలీపట్టాల పంటకళ్లా లున్నాయి గనుకనా? మన వీరయ్యకు అండర్‌ట్రయల్ ఖైదీల సౌఖ్యం అనుభవించడానికి భాగ్యం లేకపోవడంవల్ల ఏలాగో ఒకలాగు ఇతనికి దొరకాలసినవన్నీ దొరికాయి. అటుతరువాత ఒక పెద్దహాలులో ఖాలీగా ఉన్న ఒక అరుగు ఇతనికి చూపించి గృహప్రవేశం చేయించి వార్డర్ మరో డ్యూటీమీద వెళ్లిపోయినాడు.

ఇక్కడ వీరయ్యను వదలి మళ్లీ కొంచెం దూపాటిసీమ వాయుసేవనం నిమిత్తం వెళదాం రండి. ముడివేముల్లో వెంకయ్య సమాచారం ఎట్లా ఉందో కనుక్కొందాం.

౨

ఆశ్చర్యమని చూడడం, ఆశ్చర్యమని చెప్పడం, ఆశ్చర్యమని వినడమే కాని ఈశ్వరుని తెలిసికొన్నవారు ఒక్కరూ లేరు. అటులే యీయనంత మహిమాన్వితుని సృష్టివైచిత్ర్యరహస్యాలను గురించీ ఇదమిత్థమని నిష్కర్షగా తెలుసుకొన్నవారూ గగనకుసుమాలే. ప్రాచీన కాలంలో వ్యాసాదిమహర్షులంతటివారికీ ఈకాలంలో విజ్ఞాన పారంగతుడై ఆధునిక మాంత్రికుడని ప్రఖ్యాతి గాంచిన ఎడిసన్ ఇత్యాది విజ్ఞులకూ, ఎమర్సన్ మొదలైన తత్వవేత్తలకూ సమానదూరంలోనే ఉండిపోయినాయి, ఈ జగద్వైచిత్ర్య మర్మోద్ఘాటన సాధనా లన్నీనీ. చివర

జీవుల శుభాశుభకర్మలే అన్నింటికీ నిదానాలని సరిపెట్టుకొని తృప్తి నొందాలిసిందే తప్ప మరో మార్గం ఏదీ లేదని తీర్మానంచేశారు సరే!

విశేషావయవాలతో శిశువులూ, పశువులూ పుట్టడం, ఉన్నత పర్వతశిఖరాలనుండి జలప్రపాతాలు దూకడం, ఘనీభూత హిమసంఛన్న భూములందు సలసల కాగే వేడినీరు పొంగి పైకి రావడం, ఒకచెట్టు ఆకు కాలికి తగిలితే తేలు కుట్టినలాగు మండడం, వేరొక చెట్టు ఆకు ఆవిషాన్ని విరవడం, అచరచేతనాలు చరచేతనాలను మెసవడం మొదలైనవే కాదు వైచిత్ర్యాల క్రింద లెక్కింపతగినవి. ఇవి కాక అనేకవిధ వైచిత్ర్యాలున్నాయి ఈ అనంత సృష్టిలో. ఏశుక్రగ్రహంమీదనో ఉండే నూరు కోట్లమంది బృహస్పతిమీద వూడిపడి అక్కడి నూట ముప్పదిమూడు కోట్ల ప్రజలనూ వ్రేళ్ల సందుల్లో ఇరికించుకొని ఆడించుచున్నారనేదీ ఒకవైచిత్ర్యమే కాని మనపూర్వుల తీర్మానం ప్రకారం అది వాళ్లవాళ్ల కర్మం. వైయక్తిక విగ్రహాలు కాని, పరస్పర ద్వేషాలు కాని లేశమాత్రమైనా లేక పోయినప్పటికీ ఒకసంఘాన్ని రెండుభాగాలుగా జేసి చెడుగుడు ఆటకు బురికొల్పి, ఆటనడుమ ఒకవేళ ఉద్రేకం హెచ్చి ఒకరినొకరు చావతన్నుకొంటూవుంటే వినోద నిలుచొని హుర్రే అని చప్పట్లు గొడుతూ అరవడమూ ఒకవైచిత్ర్యంలో చేరిందే. ఇందులోనూ వాళ్లవాళ్లకర్మే కారణం ఒకచెంపకు రంపపుకోతా రెండోచెంపకు గందపుపూతా—ఇందుకూ కర్మే. అన్నాధిక్యంచేత అజీర్తిరోగం పుట్టి చస్తూవుంటే ఒకచోట, తదభావంచేత మాడి చస్తూఉంటారింకోచోట. దీనికీ వాళ్లవాళ్లకర్మే హేతువు. ఇట్టిస్వకర్మ నిదానీభూత వైచిత్ర్య విశేషాలు కావలసినన్ని దొరుకుతాయి, ఇక మీరే వూహించుకోండి; మచ్చుకుచూపించాను రెండుమూడింటిని.

ఇట్టి సర్వశక్తి మంతమైన కర్మప్రాబల్యంచేతనే కావచ్చు, తంజావూరు, విశాఖపట్నం జిల్లాల్లో అతివృష్టివల్ల పైర్లన్నీ కొట్టుకపోయి మురిగి చస్తూవుంటే, కర్నూలుజిల్లా దూపాటిసీమలోని పైర్లన్నీ అనావృష్టిచేత నీరు లేక ఎండి చావడం మొదలెట్టాయి. ఈకథయొక్క మొదటిభాగంలో వివరించిన విషయాలు ఘటిల్లి రెండుమాసాలు కడచిపోవచ్చాయి. పాటుక్కుమని ఒక చినుకైనా పడింది కాదు త్రిపురాంతకపు ప్రాంతాల్లో. చినుకుమాట ఉండనీయండి, కనుమాపు పారినంత మేరంలో ఏదిక్కునందు గాని ఇంతమబ్బైనా కనుపడుతుందేమో అని బిక్కమొగాలు వేసుకొని చూస్తుండేవాళ్లు జనులు కాని ఆమాత్రపుభాగ్యమైనా లభించేది కాదు. ముడివేముల వాళ్ల ఘోష చెప్ప శక్యంకాదు. చెరువులోని నీరు క్షీణించిపోతూ ఉన్నట్లే వీళ్ల మొగాల్లోని రక్తం కూడా క్షీణించిపోతూ ఉంది. ఈయేడైనా ఇంత కడుపునిండా తిని ఇంటిపట్టున ఉండి కాలం గడుపుతాము అనుకొంటే, వీళ్లకర్మం వ్యాధిరూపం దాల్చి వీళ్ల హృదయనీడాలనుండి మనోరథపక్షుల నన్నింటిని చిందరవందరగా ఎగరగొట్టి ప్రాణహరణం కావిస్తూఉంది. అనాథలు ఏం చెయ్యగలరూ? దేవీదేవతలకు మొక్కుకొని ముడుపులను కట్టారు. పొట్టేళ్లను వేయిస్తామని మొక్కుకొన్నారు దొనకొండ గంగమ్మతల్లికి, వాన గురిపిస్తే. ప్రభలనూ, కుంకుంబండ్లను కట్టుకొని వస్తామని యల్లమందకోటేశ్వరుడికి మొక్కారు. మల్లికార్జున దేవరను సేవింతా మనుకొన్నారు. ఇంద్రపూజలు చేయించారు. ఒక్కపొద్దులున్నారు. జాతర్లే కాదు, జాగరాలే కాదు, రాంభజనలే కాదు, రామాయణాలే కాదు, ఎన్నిపాట్లో పడ్డారు. కాని ససేమిరా. ఇంద్రభగవానుడు బిర్రబిగిశాడు. చెరువుకింది పైరంతా కంకి విడవడానికి వచ్చింది, చెరువులోనినీళ్లు పూర్తిగా ఎండి పోయినాయి చెరువు నడికట్టమీద నిల్చొని జోటజోట కన్నీళ్లు కార్చారు అటు ఎండిపోయిన చెరువును చూచీ, ఇటు కంకివదులుతూ ఉన్న పైరును చూచీ. కర్మసంతాడితులైన ఇట్టి దిక్కుమాలిన పక్షులవంటి కృషకులు కన్నీళ్ళతో కడిగిఇచ్చే డబ్బులను పోగుచేయడంవల్ల సమకూర్చబడిన ద్రవ్యరాశులను—ఈద్రవ్యం ఏవిధంగా వచ్చిందాయని తలపైన లేని శ్రీమంతకుమారులు, రాజాధిరాజపుత్రులు, నిర్లక్ష్యాహంకార గర్వపూరితులు, సకల వ్యసనాలకు దాసానుదాసులు, తమ మానవ జన్మముయొక్క పరమార్థమే

గుర్తింపని వివేకశూన్యులు మహానగరాల్లోని దివ్యప్రాసాదాల్లో మద్యపానాలకు, ఫాన్సీడాన్సులకు, పైశాచికపు తిండ్లకు, చిల్లపెంకుల్లాగు తగలేస్తూ ఉంటారు. అటు పల్లెటూళ్ళలో రైతులు నిత్యైకాదశులను, నిత్యశివరాత్రులను సమాచరిస్తూ ఉంటారు. ఆహా, ఎంత విచిత్రాలైన, ఎంతవిపరీతాలైన కర్మభోగాలు వీరివి!

ఇంటికంతా అల్లారు ముద్దుగా ఉన్న సోముడు పోయినాడు. వాణ్ణెప్పుడు వదలకుండా వెంట వుండి ఆఇంటికి మరింత నిండుతనం కల్పిస్తూవచ్చిన గంగ పోయింది. ఈదుఃఖంతోనే కృశించిపోతూవున్న వెంకయ్యా వెంకమ్మల దౌర్భాగ్యం అనావృష్టిరూపంగా పరిణమించి మరోవ్రేటును విసిరింది వీరినెత్తిమీద. రాగిమళ్లల్లోని నీరు ఇగిరిపోయి, అడుసుగా ఏర్పడి, గట్టిపడి, ఎండి చివరకు బీటలువారిపోయింది మళ్ళల్లోని నేలంతా. ప్రతిరోజూ ఈదంపతులిద్దరూ వాడబారి చివరకు ఎండబారిన పైరును చూస్తూ పొలంగట్లమీద కూర్చొని ఇన్ని కన్నీళ్లు విడిచివస్తూ వుండేవారు ఇంటికి.

మళ్లల్లో నీళ్లు పుష్కలంగా వుండవలసినరోజుల్లో ఇట్టిదశ సంభవించడంచేత కడుపునిండా తిండిలేని వానికి యౌవనంలోనే వృద్ధాప్యం వచ్చినలాగు అకాలంలోనే పైరు పచ్చపడి ఎండిపోయింది. సకాలంలో పండినపైరు పచ్చదనం వేరూ ఈపచ్చదనంవేరూ. కంకుల భారంచేత పైరంతా నేలకు వంగిపోవలసింద మంచిగింజే పట్టినట్లయితే. అంతా పొల్లుగింజే, ఆకాశంవంక నిక్కబొడుచుకొని వున్నాయి కంకులన్నీ. మీలోమాలో ఒకటే శూన్యం వ్యాపించిఉంది అని పరస్పరం పరామర్శించుకొంటున్నలాగు ఉంది ఆకాశం కంకులూను. నూర్పిస్తే పుట్లకు పుట్లు కావలసినచోట ఏ పది పదిహేనుపల్లో తేలాయి. అవైనా అర్థపరిపక్వాలే. తినడానికి ఒకవారానికైనా రావు ఆగింజలు. అమ్మితే అసలే సున్న. ఇక చేయవలసిం దేముంది? చాలామంది రైతులు కుటుంబాలను వెంట వేసుకొని వరికోతల సమయం సమీపిస్తూ ఉన్నందున కృష్ణాగోదావరీల డెల్టాప్రాంతాలకు ప్రస్థానంచేయాలినని నిశ్చయించుకొన్నారు. వెంకమ్మ వెంకయ్యలకు వేరొక ఉపాయం కన్పించింది కాదు. వాళ్లూ సిద్ధమైనారు అందరితోపాటు.

కాని ఉన్న వూరును, స్వంత ఇంటినీ వదలాల్నంటే సులభమైన పని కాదు. విడువకుండా అయిదారేండ్ల పాటు నివసించిన అద్దెయింటిమీదకూడా ఒకవిధమైన వ్యామోహం ఏర్పడుతుంది. మాఇల్లు, మావూరు, మాతాలూకా, మాజిల్లా, మారాజధాని, మాదేశం అని ప్రతివాడూ మహాప్రేమగౌరవాలతో చెప్పుకొంటూ వుంటాడు తన గ్రామాదులను గురించి. ఈప్రేమ గౌరవాలే దేశభక్తిగా బరిణమించి జీవితసర్వస్వాన్ని ఆదేశంకొరకే ధారపోసేలాగు ప్రేరేపిస్తూవుంటాయి మానవుణ్ణి. ఈదేశం నాదీ, ఇది నాజన్మభూమీ అని ఒకపర్యాయమైనా స్మరించనివాడు జీవచ్ఛవమనీ, అట్టివాడు నరపశువనీ ప్రసిద్ధికెక్కిన కవిపుంగవు లనేకులు ఉద్ఘోషించియున్నారు. నీచసన్మానాలకూ, తుచ్ఛములైన పదవులకూ, బిరుదులకూ ఆకలిగొని క్షుద్రస్వాంతులైన కుక్షింభరు లనేకులు అంతరాత్మను చంపుకొని, పైకిమాత్రము "దేశభక్తేమిటి? ఇది ఒక ఫోంగ్"అని దాన్ని నిరసిస్తూవుంటారు. అట్టివారు సైతమూ మాయిల్లూ, మావూరూ అని మాత్రము చెప్పుకొనక మానరు. ధనవంతులయ్యు స్వార్థులు, కృపణులూనైన ఈపిరికిపందలమాట అట్లా వుండగా, ఒక భిక్షుకుని పిలిచి మీ దేవూరని ప్రశ్నించిన యెడల వతడునూ మహాప్రేమతో, ఆదరంతో, అభిమానంతో చెప్పుకొంటాడు తనది ఫలాని గ్రామమనీ. ఆగ్రామంలో అతనికి జీవననిర్వాహానికి వెరనైన లేకపోవుగాక, అతనివూరిమీద అతనికి అభిమానం పోదు. ఎవరైన దాన్ని నిందిస్తే పోట్లాటకుగూడ తయారవుతాడు. ఏమీ లేని బిచ్చగాడికే ఇటులైనప్పుడు సంవత్సరాలాదిగ కాపురంజేయుచుండిన ఇంటిని, అనేకసౌఖ్యాలకు ఆకరమైనదాన్ని, అనేక స్మరణలకు తావలమైనదాన్ని, తమ జీవితరంగం పై తెర బడనున్న సమయాన్ని తలిదండ్రులు దగ్గరకు బిలిచి శుభాశీర్వాదాలతో తమచేతి నొప్పగించి పోయినదాన్ని వదలాలి అంటే ఎంతకష్టం, ఎంత ప్రాణసంకటం?

వెంకయ్య ఏదో విధంగా మనస్సును గట్టిచేసుకొన్నాడు. కాని వెంకమ్మకు ధైర్య మాగింది కాదు,

నిజానికి పతికంటే పత్నికే ఎక్కువసంబంధం ఇంటితో. మానవజన్మ సాఫల్యానికి హేతుభూతాలైన చతుర్విధ పురుషార్థ సంపాదన నిమిత్తం బాహ్యారంగాలతో ఎక్కువ సంబంధం కలిగించుకోవలసివస్తుంది పురుషుడికి. అందువల్ల గృహంతో ఎక్కువసంబంధం కలిగి తీరుతుంది స్త్రీకి. కాలవైపరీత్యంవల్ల ఇప్పుడీ దురవస్థ కలిగింది కాని అత్తమామలు బాగున్న కాలంలో, పాడిపంటలుకొల్లగనున్న కాలంలో ఆయింటియందే ఎన్ని సౌఖ్యాలనుభవించింది కాదు వెంకమ్మ. అట్టి యింటిని వదలి పరదేశానికి బోవాలి అనుకొనేసరికి ఆమెకు దిగులు, బెంగ ఆరంభమైనాయి. అన్నము ముందు కూచుంటే యేమేమొ తలపులోకి వచ్చేది. అసలు అన్నం తినాల్ననే బుద్ధే పోయింది. ఏదో సుబులుగా ఉండేది. నడవబోతే కాళ్లల్లో సత్తువ పోయినలాగు గనుపించేది. తీరా వెళ్లవలసినరోజు వచ్చేసరికి తా నాయింటిని వదలి రాలేనని ఏడుస్తూ కూర్చుంది. ఆనాడు ఒకటి రెండు కుటుంబాలవారు వెళ్లిపొయ్యారు. వీళ్ల ప్రయాణం సాగిందే కాదు. ఒకనాడు యిల్లు వదలి కొంత దూరం పోయి మళ్లీ వచ్చింది. ఇంకోనాడు ఊరు దాటినతర్వాత ముందుకు సాగలేక పడిపోయింది. మరి రెండు మూడు పర్యాయాలు ఇల్లే ప్రయాణా లాగిపోయినాయి ఊరు వదలి వెళ్లదలచిన వాళ్లు చాలామటుకు వెళ్లిపోయినారు. ఇక ఎన్నిరోజులనీ ఈలాగు గడపడం. ఏనాడో ఒకనాడు వెళ్లితీరాలిసిందే కాని అక్కడ వుండే భాగ్యమేమో లేదు. ఉంటే ఉపవాసా లాచరించవలసిందే. ఇక వెళ్లదలచుకొన్న చోటికి గూడా సకాలంలో వెళ్లి ఏదో పనిని చూచుకొనకుండా అన్నీ మిగిలిపోయిన తర్వాత వెళ్లిమాత్రం ఏం లాభం? అక్కడా పస్తుండవలసిందే. ఇవన్నీ తలపోసుకొని తలపోసుకొని ఇక ఈలాగూ వెళ్లక విధిలేదని మనస్సును రాయిచేసికొని బయలుదేరిం దామె. అచేతనమయినా ఇంటియం దెంతా కర్షణశక్తి! కనపడినంతవరకూ దాన్ని తిరిగితిరిగి చూస్తూ వెక్కి వెక్కి ఏడుస్తూనే పోయింది. ఊరు దాటింతర్వాత కనపడ్డంత మేరా గ్రామంవంకే చూస్తూ విలపిస్తూ నడిచింది పాపం. తర్వాత రైల్లో ఎక్కి పోతూఉంటే గుండ్లకమ్మ తగిలింది దారిలో. నీనీళ్లరుణం నాకు నేటితో తీరిందిగా తల్లీ యని ఆవురని ఏడుస్తూ రెండు చేతు లెత్తి మొక్కింది. కనుపడినంతవరకు నదిని చూస్తూ తలను అల్లే కిటికీబైటికి వ్రేలవేసికొని కళ్ల నీళ్లు కారుస్తూ కూర్చుంది.

## 3

ఒక్కొక్క ఘటనావిశేషంవల్ల మానవుని ప్రవర్తనయం దప్పుడప్పుడు విపరీతమైన మార్పు గలుగుతూ ఉంటుంది. దుఃఖాంతక ఘటనమైన యెడల ఇక చెప్పవలసిన పనే లేదు. ముడివేములలోని ఘటనానంతరం అనున్నాటినుంచే వీరయ్యయం దొక విలక్షణమైన పరివర్తనం గలిగి దినక్రమాన్నే ప్రవర్ధమాన మౌతూ పోయింది. కుర్రవాడి సోముడి దుర్మరణమే ఇందులకు ప్రధానకారణం. రెండోది గంగమరణం. ఆనాడు కోపోద్రేకంచేత మతిపోయి ఏమేమో చేశాడు వెర్రియెత్తిన వానివలె, పరిణామఫలం విచారించకుండా. కాని యాకోపం చల్లారగానే ఆరంభమైంది అపరిమితమైన పశ్చాత్తాపం వీరయ్యకు. ప్రబలములైన ఇంద్రియావేగాలకు వశీభూతుడై మన్నూ మిన్నూ గానక అకార్యం దేనినైనా చేయడం, ఆఆవేగం చప్పబడిపోవడంతోటే చేసినదానికి ఏడ్వడం—ఇదీ ఒక మానవ స్వభావమే! ఎవరినిమిత్తమో, దేనినో, పేరునకనో మరియెందుకనో చేయబోతే మధ్య అమాయికుడైన కుర్రవాని ప్రాణాలూ, నోరులేని గోవు ప్రాణమూ పోవుట సంభవించెనే యని తీరనిదుఃఖం పట్టుకొన్న దితన్ని. తన మెడను జుట్టుకొన్న శిశుహత్యా, గోహత్యాపాతకాలకు ప్రాయశ్చిత్త మేదైన గలదాయని యెల్లప్పుడూ ఆలోచనామగ్నుడై వుంటాడు. పగలు అందరితో పనిపాటల్లో మునిగి ఉండడంచేత పెనిటెన్షియరీలో కాలం ఏలాగో గడచిపోయేదే కాని, సాయంకాలం తిండ్లూ తిప్పలూ పూర్తియైనపిదప ఖైదీల నందరినీ—ఏహాలులో వారిని ఆహాల్లోనే—లెక్కవేసుకొని—ఈగణనం వార్డర్ల సాయంకాల నిత్యకృత్యాలలో ఒకటి—తలుపులకు తాళాలు బిగించి వార్డర్లు వెళ్లిపోయిన తరువాత లోపలి ఖైదీలందరు—ఇపుడు వీరికి మహానంద సమయం—సరససల్లాపాలతో, పిచ్చికేకలతో, ఆటలతో పాటలతో,

కొందరు నటకులూ కొందరు ప్రేక్షకులుగా మారి నాటకాలూ ఫార్సులనుగూడా ప్రదర్శించుకొంటూవుంటారు-ఎకసక్కేలతో, వెకిలినవ్వులతో, కూనరాగాలతో, ఈలలతో, పెడబొబ్బలతో, జయజయధ్వానాలతో, చేతిచప్పట్లతో--కొందరు వక్తలూ కొందరు శ్రోతలుగ మారుతూఉంటారు—వినండి వినండి కేకలతో ఎవరి ఇష్టం వచ్చినలాగు వాళ్లు అల్లరి సాగిస్తూ, హాలునంతటినీ మారుమ్రోగిస్తూ ఉంటే ఇత నెందులోనూ జోక్యం కలిగించుకొనక తనవేదిని ఆశ్రయించి—ప్రతిహాలులో ఒక్కశరీరానికి పండుకొనడానికి సరిపోయేలాగు అడుగుఎత్తుగల అరుగులు నిర్మింపబడి ఉంటాయి—తన కీహత్యాద్వయపాతకాన్నుంచి ముక్తి యేలాగు లభిస్తుందా అని ఆలోచించుకొంటూ వాళ్ళందరినీ తలచుకొని ఇంతసేపు విచారించి తుద కట్లో నిద్రిస్తూ ఉండేవాడు. పశ్చాత్తాపం, చింతా, సిగ్గూ వీనికే తప్ప దురభిమాన గర్వదురహంకారాల కెక్కడా తావే లేదు అతని హృదయాంతరాళంలో ఇపుడూ......

రక్షకభటవృత్తిని అవలంబించిన వాళ్ళకుకూడా లజ్జా పశ్చాత్తాపాలు కలుగుతాయా అని సందేహించేరు సుమా! వృత్తి ఎటువంటిదైనా వాళ్లదీ మానవజన్మే కదా! వాళ్ళకూ తల్లిదండ్రులున్నారు. వాళ్ళరక్తమే వీళ్ల దేహాల్లో ప్రవహిస్తూ ఉంటుంది. వాళ్ళకూ ఆకలిదప్పులున్నాయి. రాత్రిపూట వాళ్ళకూ కునికిపాట్లూ ఆవులింతలూ వస్తూనే ఉంటాయి, ఎక్కడయినా చాలా రాత్రి మిారేవరకూ పహరా నెత్తిన పడితే. కాల్లో ముల్లు గుచ్చుకొంటే వాళ్ళూ అబ్బనో అమ్మనో స్మరిస్తూనే ఉంటారు. కంట్లో నలక పడితే వాళ్లకూ మెర మెరలాడుతుంది. ఉండాలిసిన మానవధర్మాలన్నీ వున్నాయి వాళ్ళకుగూడా. కాని ఏం చెయ్యాలి? మహావికటమైన భయంకరమైన కాలం దాపరించింది, ఈకాలం పాడైతే.

మంచికళ్లెం లేని నిండు జవ్వనపు గుర్రంమిాద సవారి దీస్తూఉన్నకాలంలో సంవత్సరం దప్పితే సంవత్సరం బీరువోకుండా సంతానం కవలు కవలుగా వెల్లివిరియచేసి భరతఖండ జనసంఖ్యా పరిమాణాన్ని వృద్ధిదశలోనే యుంచి దానిగౌరవాన్ని కాపాడుతూవచ్చిన వంశోద్ధారకులైన పెద్దమనుష్యు లెందరో ఆకాస్తనరాలూ సళ్లువదలిన తర్వాత హనుమాన్ కాసెలను బిగించి, యువతీయువకుల కొందరిని గూర్చుకొని సభలలో సంతాననిరోధంగూర్చి, దానివల్ల కలుగు లాభాలను గురించీ, దేశానికి తమకూ గలుగగల క్షేమాన్ని గురించీ మహా ఆర్భాటంగా లెక్చర్లు కొడుతూ ప్రచారం చేస్తూనే వున్నా రొకమూల. ఒకవైపు బర్తుకంట్రోల్ గొట్టాలకు గిరాకీ పెరిగిపోతూనే ఉంది, కాని మరోవేపునుండి యథాపూర్వం చీమలపుట్టలు బయలుదేరుతునే వున్నాయి. ఇట్లు దేవతానికరజేగీయమానధన్యభారతభూమిభోగ సందర్శన మహోత్కటచాపల్యంచేత కుప్పతిప్పలుగా దేహధారణాలు కావిస్తూ ఉన్న జీవాత్మల కన్నింటికీ జీవనోపాయవృత్తులు సమూలంగా నశించాయి ఈరోజుల్లో. ఇప్పుడందరికీ ఒక్కటే అనూచానవృత్తి—నౌకరీ వృత్తి దొరికింది. ఇదివరకు ఏపిడికెడుమందో దీన్ని ఆశ్రయించుకొని వుండేవాళ్లు. తక్కిన వాళ్లందరూ జీవననిర్వాహాని కత్యవసరాలైన కృషి, వాణిజ్య, శిల్పకార, కర్మకార, చర్మకార, మణికార, చిత్రకారాది నానావిధవృత్తులలో పరిశ్రమ సలుపుతూ ఉండడంచేత అందరికీ ఆనందంగానే కడిచిపోతూ వచ్చాయి దినాలు. కాని పాదశతాబ్ది ఆదిగా ఈమిాద వచిందినవారు మాత్రమే కాదు, సమస్త జాతులవారికీ ఈ అనూచాన సేవావృత్తే ధ్వజస్తంభంలాగు, లైటుహౌసుమిాది దీపంలాగు దృష్టిగోచరం కావడంవల్ల వారందరూ స్వవృత్తులను స్వయంగా నిర్మూలించుకొని అనూచాన వృత్తికే ఎగబడ్డారు. అంతటితో ఆదీ కోతుల గుంపులో బడ్డ మిఠాయిపొట్లంలాగు మాయమైంది. లడ్డువుండలు దొరికిన వాటికి దొరికాయి, లేనివాటికి లేదు. కొన్నిటికి కావలసినవాటికంటె యెక్కువ దొరికాయి. కొన్నిటికి అసలే సున్న. దొరకనివారికందరికీ నిర్వ్యాపారపు వృత్తి గతి అయింది. ఈభగవతితోటే ప్రస్తుతం భారతీయుల్లో ముప్పాతికపాళ్లమందికి రమణవిలాస సౌఖ్యానుభోగం. కాబట్టి అందరికీ నౌకరివృత్తి. అది దొరకక

“పోతే నిర్వ్యాపారవృత్తి. దానితో ఐహికనివృత్తి. చతుర్విధ పురుషార్థాల్లో మొదటిదానితో మన కిప్పుడాట్టే అవసరం లేదు గనుక శేషించిన పురుషార్థత్రయంతో ఈవృత్తిత్రయాన్ని సరిపెట్టుకొని మనము దాన్ని సాధిస్తూనే ఉన్నందున మనమూ పురుషార్థులమనే సంతోషించుకొనవచ్చు. ఇదివరకు పురుషసింహాలే అనుకుంటే ఈ అనూచానవృత్తి సంపాదనకోసం పడియేడ్చేది, ఇప్పుడు అంగనామణులుకూడా ఆరంభించారు ఈసేవావృత్తికొరకు మోరలు తెరుచుకొని అంగలార్చడం. కాబట్టి అంతిమవృత్తిద్వయానికి ఇకముందు మరింత పెరిగిపోవచ్చు అప్రెంటిసుల సంఖ్య. తథాస్తు.

ఉపవాసాలైనా చెయ్యాలి లేకపోతే ఆత్మహననపూర్వకంగా దేహాన్నమ్ముకొని అనూచానవృత్తినైనా స్వీకరించాలి ఎక్కడైనా లభింపగల సౌభాగ్య మంటే. కడుపుమంటకు తాళలేక ఏకళ్లాన్నైనా నోట దగిలించుకొన్నామా అంటే సరి, ఇకేముంది? డ్రైవరు ఎటు దిప్పితే అటు తిరుగుతూ ఉండాలిసిందే. మన తలకాయే మనవశంలో ఉండదు. ఇంకోవేపునకు తిప్పుదామనుకొన్నా తిప్పలేం, డ్రైవరు దాన్ని ఎదురుప్రక్కకు తిప్పుతూ ఉన్నప్పుడు.

దీనికి తోడుగా అనూచానవృత్త్యవలంబకుడికి వివశత్వం కలగడానికి మరో కారణం కూడా వుంది. పూర్వకాలం–అంటే మరీ ప్రాచీనం కాదు, 30, 40 ఏండ్లక్రింద పగటిభాగోతుల నాటకాలు మిక్కిలి ప్రచారంలోవున్న సమయంలో—ప్రహ్లాదనాటకం ఆడేటప్పుడు నృసింహమూర్తి వేషగాడికి సింహతలాటం మొగానికి తగిలించుకోగానే ఉగ్రంపెరిగివచ్చేదనీ, ఒకమారు ఈ ఉగ్రం మితిమీరిపోవడంచేత హిరణ్యకశిపు వేషగాణ్ణి నిజంగానే తుదముట్టించి అతని పేగులను మెళ్లో వేసుకొన్నాడని మహావిచిత్రంగా చెప్పుకొనేవారు. ఈవార్త సత్యానికి చాలా దగ్గరలో వున్నదనుకొంటాను. దీన్ని స్థిరపరచగల దృష్టాంతాలు ఇప్పుడు కావలసినన్ని దొరకుతూ ఉన్నాయి. ఏలాంటే—మన మామూలు దుస్తులు ధరించిఉన్నంతసేపూ మనదేశసోదరుడు మన మనిషే. అందరికీమలె అతనిముఖంకూడా సౌమ్యంగానే కనబడుతుంది. తెచ్చిపెట్టుకొన్న గాంభీర్య గర్వాహంకారా లెక్కడా కాన్పించవు ఆమొగంమీద. ఇతడూ మనవాడే కదా అని అతణ్ణి చూసేవాళ్లకు భయవిస్మయా లేమీ కల్గవు. అంతా సరిగానే సరళంగానే ఉంటుంది. కాని అనూచానవృత్తికవచం (Uniform) వంటిమీద పడేసరికి వస్తుంది ఎక్కడలేని కళా, ఎక్కడలేని హంగూ, ఎక్కడలేని వయ్యారం, ఎక్కడలేని ఠాకూ, ఎక్కడా లేని నీటూ, ఎక్కడాలేని ఒడలివిరుపులూ, మెడవిరుపులూ, నడవిరుపులు, తొడవిరుపులు, నడుంవిరుపులు అన్నీనీ. తనయంతటివాడు ఎవడూ లేడనే ఒక విశిష్టమైన భావం మొగంమీద ఏర్పడుతుంది. తానొక సురక్షితమైన దుర్గంలాటి స్థానాన్ని పొందానుకదా అని ఉల్లాసం కలుగుతూ ఉంటుంది మనసులో. తానూ ఒక అధికారి నని అహంకారం కలుగుతుంది అంతరంగంలో. ఈప్రకారం బాహ్యరూప పరివర్తనానురూపమైన అంతఃపరివర్తనంతో ఆరంభమాతుంది కర్తవ్యపరిపాలనకార్యం. నోట్లో కళ్లెం అదివరకే తగిలి ఉంటుంది కాబట్టి ఇక ఎటు ద్రిప్పితే అటునుంచే మొదలు చేనుకోతా. పదినిముషాల స్వల్పకాలంలో చూస్తూచూస్తూ ఉండగానే చేనంతా ఖాళీ అయి కుప్పలుపడిపోతాయి. ఓహో! ఎంతశౌర్యం! ఎంత పరాక్రమం! ఏం చాకచక్యం!

ఏకారణంచేతనయినా ఈపరవశత్వ వివశత్వాలకు హేతుభూతాలయిన ఉపాధులు తొలగడం సంభవిస్తే యథాపూర్వం మనసోదరుడు మనమనిషే అవుతాడు. అప్పుడూ కలిగితే కలిగేది కవచధారిగా నుండిన కాలంలో తాను చేసిన కార్యాకార్య విమర్శన మన సోదరుడికి.

కేవలం స్థానపదభ్రంశం కలగడంచేతనే కాదు వీరయ్య కతని పూర్వవృత్తం దోషయుక్తమని తోచింది. కుర్రవాడి మరణంచేత ఇతనికి హార్దికమైన అనుతాపం కలిగింది. స్థితిగతు లింత విపరీతంగా బెడిసి తనకు ఎదురు తిరుగుతాయని ఇతడు కలలోగూడ తలపోశాడుకాదు. కావున అచింతనీయంగా తనవల్ల ఘటిల్లిన మహాపరాధం

చేత పరితాపం ఒకవేపూ, సిగ్గొకవైపూ, ఇతన్ని బాధిస్తూ ఉన్నాయి.

ఈబాధ ముందు జైలునిర్బంధా లేమీ ఇతనిలెక్కలోకి వచ్చాయికావు. అది గాక తాను చేసింది దోషమనీ తత్పరిహారానికిగాను శిక్షను అనుభవించడమే తనపని యనీ నిశ్చయపరచుకొన్నయెడల ఆ శిక్షవలన గలిగే నిర్బంధా లతనిని బాధించవు. ఇతడు జైలుకష్టాలను లెక్కగొనకపోవడమే కాదు. అధికారులు తనపరం జేసిన ఎట్టి కఠినకార్యాన్నైనా సంతోషంతో శ్రద్ధగా జేసి వప్పగిస్తూ వచ్చినాడు. చెప్పినపనిని తిన్నగా చేయక పోవడంచేతా, అశ్రద్ధగా చేయడంచేతా, అధికార్లను ఎదిరించడంచేతా ఖైదీలకు దిట్లు, కాలితాపులు, కొరడా దెబ్బలు, వేత్రప్రహారాలు, నిరాహారశిక్షలు, ఏకాంత గృహబంధనాలు ఇత్యాదులకు స్వాగతాలియ్యాలిసి వస్తుంది. తనకిచ్చినపనిని శ్రద్ధతో చేసి వప్పగిస్తూ వచ్చినందున వీరయ్యకిటువంటి శుభావకాశా లేమీ లభించాయికాదు. ఉన్నతాధికారు లందరూ మౌన మూని పోతూ ఉండేవారు అసలీ ఉచ్చపదాధికార్లతో ఎక్కువసంబంధం ఉండనే ఉండదు ఖైదీకి. ఏ స్వల్పమాత్రమైనా వుంటే వుండేది వార్డర్లతో. ఖైదీయొక్క శాంతి సహనాలను పరీక్షించడానికో, లేక స్వభావమో లేక కులాసా కొరకో చేసే పనిలో రవంతతప్పు గన్పించిన యెడల దానిని ఆధారంచేసుకొని హాత్ మాత్తని అరుస్తూ ఉంటారు వార్డర్లు ఖైదీమీద. వీళ్లను లోబరుచుకోడానికి కావలసినన్ని ఉపాయా లున్నాయి. కాని వీరయ్య ఓర్పే వీరినందరిని జయించింది.

ఎదురు తిరిగినవాణ్ణి దండించడానికి చేయి లేస్తుంది కాని లొంగిపోయి క్రింద పడివున్న వానిమీద గాదు. ఇది స్వాభావికం. కాని కొన్నిచోట్ల ఒక్కొక్కప్పుడు చచ్చినలాగు భూమిమీద పడిపోయినప్పటికీ ప్రహార వర్షం కురిపిస్తూనే వుంటారే, దీనితాత్పర్యమేమిటి? అంటే దానికీఉంది ఒక అతిసూక్ష్మమైన రాజనైతిక రహస్యం. కాని మన కిప్పు డెందుకా గొడవంతా. చింతావ్యాకులాలకు జిక్కి వీరయ్య అవలంబించిన శాంతి సహనాలమూలకంగా జైలుబాధల ఉష్ణం సహించుకో గల్గడమూ, పనులన్నీ సరిగ్గా నెరవేరడమే కాకుండా, కొన్ని నెలలు కడచేసరికి అధికారుల అనుగ్రహనామక మేఘా లితనిమీద ఛాయాదానం చేయడం మొదలెట్టాయి. మంచి చాకచక్యం ఉండాలి ఇటువంటి మేఘచ్ఛాయలను అనుభవించడానికి. ప్రచండమైన నిదాఘతాపాన్నార్పే చల్లని వర్షానికే కాదు, క్షణమాత్రంలో సమస్తమూ భస్మీభూతంచేయగల పిడుగుకూ ఈమేఘమే జన్మస్థానం. అధికార్ల దయవల్ల ఇతని కాజయిల్లో కాన్విక్ట్‌వార్డర్ పదవి లభించింది. మంచినమ్మకం కుదిరితే కాని ఈపదం లభించదు. అందులో భూతపూర్వ రక్షకభటుల కెక్కువ ప్రిఫరెన్సు ఉంటుం దనుకొంటా. ఎందుకంటే వాళ్లను తరిఫీతు (Train up) చేయవలసినపని ఉండదు, ఇతరులనంత ఎక్కువగా డ్రిల్లు, కవాయత్ మొదలైన వాట్లల్లో. జైలుబయటికి స్వతంత్రంగా వెళ్లడానికి వీళ్లకధికారం లేదు కాని జయిలులోపల వార్డర్ల పనులన్నింటినీ ఈ‘కానీకార్డ్లే’చేస్తూవుంటారు. ముఖ్యంగా రాత్రిళ్ల పారా అంతా వీళ్ళవంతే. ఈపదవితోటే ఇతనికి వేలూరు జయిలుకు బదిలీ అయింది.

పిల్లికూనల మార్పుల్లాగు ఈ జైళ్లమార్పుల్లో ఎక్కడికి పోయినా పూర్వోదాహృతమైన తంతు యావత్తూ జరుగుతునే ఉంటుంది. అల్లే జరిగింది వీరయ్య విషయంలోకూడా. ఇక్కడ ఇతనిస్థితి మరింత శ్రుతి మించి రాగాన బడింది. తన డ్యూటీని యథాపూర్వం యేమాత్రం లోపంలేకుండా నెరవేరుస్తూనే వచ్చేడు కాని మునపటికంటె ఎక్కువ మౌనం దాల్చి ఎల్లప్పుడూ ఏదో ఆలోచనామగ్నుడై విన్నవదనంతోనే ఉండేవాడు. ఇతనితో పరిచయం గలిగిన ‘కానీకార్డ్లు’ (Convict warders) ఏదైనప్రసంగంలోనికి లాగాలెనని ప్రయత్నిస్తూ ఉండేవాళ్లు కాని లాభం లేకపోయేది. ఏదో సాకు చెప్పి వారినుండి తప్పించుకొని దూరదూరంగా వుంటు వచ్చాడు. ముఖవైఖరి హృదయాన్ని దహిస్తూ ఉన్న చింతాజ్వాలను ప్రకటిస్తూవుండేది. మామూలుగా రాత్రిళ్లు వార్డ్లమీద గస్తీ తిరుగుతూ వుండవలసిన డ్యూటీ లభిస్తూ ఉండడంచేత నిద్రించడానికి అవకాశమే లభించేది కాదు. చింతాభారంచేత పగలూ నిద్ర వచ్చేది

కాదు. ఎప్పుడైనా కండ్లు మూయడం సంభవిస్తే శిశుహత్యా, గోహత్యా అని వుచ్చరిస్తూ అస్పష్టంగా ఉల్కిపడి పడకనుండి లేచేవాడట. ఇట్టి అస్వస్థస్థితిలో మరి కొన్ని నెలలు గడచాయి. పూర్వ వర్తమాన కారాగారాల్లో ఉంచి రెండు శిశిరవసంతాలను దాటేశాడిత డని తేలింది, అనంతరం కొద్దిరోజులకే.

౪

ముడివేములకు పూర్వోత్తరంగా సుమారు నాలుగైదు మైళ్ల దూరంలో ఉమ్మడివరం అనే మరో గ్రామం ఉంది. గ్రామీణులు ఉమ్మడారం అని పిలుస్తూ ఉంటారు. ఇది ఒక అగ్రహారం. ఈ ఊరికి తూర్పుదెస ఉత్తరదక్షిణాలుగా కళ్లేరను వాగు ప్రవహిస్తూ ఉంటుంది ఇదే ఈ గ్రామానికి జీవనాధారం. ఇది గుండ్లకమ్మకు ఉపనది. ఉత్తరాన్నుంచి దక్షిణపూర్వంగా ప్రవహిస్తూ బోయి తంగిరాల అనే గ్రామందగ్గర ఇది ఆనదిలో కలుస్తుంది. శ్రీపర్వతానికి పూర్వదిగ్భాగంలో ఉన్న ఈ ప్రాంతాల కీ రెండునదులనూ గంగాయమునలని చెప్పిన చెప్పవచ్చు. ఈ ఊరికి శాలిక్షేత్రా లనదగిన మంచి పొలాలన్నీ ఈకళ్లేటితీరాన్నే ఆశ్రయించుకొని వున్నాయి. ఏటి ఒడ్డు పొలాల కిచట తోటలనికూడా పేరు.

ఊరికి ఒకమైలు ఉత్తరంగా నృసింహస్వామి కొండ వుంది. ఈ గ్రామపు అగ్రహారీకుల వంశమందు జనించిన భద్రపురుషులలో నొకరగు నృసింహ యోగీంద్రులు ఈపర్వతమధ్యమందలి ఉపత్యకను తపోనుష్ఠానాదులకు యోగ్యప్రదేశమని గ్రహించి అచట నొక ఆశ్రమాన్ని, దానినడుమ నృసింహదేవాలయాన్నీ గట్టించారు. దీన్నుంచే కొండ కా పేరు వచ్చింది. యోగీశ్వరు లెక్కువకాలం దేశాటనంలో గడుపుతూ అప్పుడపుడు వచ్చి ఈ ఆశ్రమంలో ఉంటూ ఉండేవారు. శిష్యసమేతంగా వీరి సంచారం యావత్తూ కాలినడకనే జరిగింది. భారతవర్షంలోని ముఖ్యతీర్థాల్లో వీరు సేవింపనివి లేవు. మంత్రతంత్ర వనస్పతిమూలికాదుల ప్రయోగాల్లో మంచి నిపుణులు. అందువలన ఈ ప్రాంతవాసు లందరూ గురువులనీ, అయ్యవారనీ, యోగీశ్వరులనీ సన్మానపూర్వకంగా శ్రద్ధాభక్తులతో వీరిని సేవిస్తూ ఉంటారు. స్వామిదర్శనం కొరకు వచ్చిపోయే స్త్రీపురుషులతో, జ్ఞానోపదేశశ్రవణం నిమిత్తం వచ్చు జిజ్ఞాసువులతో, రోగగ్రస్తులై వచ్చి ఇచటినాయువును ఒక్కనాడు సేవించినంతమాత్రాన్నే నీరోగులై సంచరిస్తూ ఉండే జనులతో, సంతానకాములై మునిసందర్శనార్థ మేతెంచిన దంపతినివహాలతో ఈ యాశ్రమం నిత్యమూ కళ్యాణమందిరంలాగు ఉంటుంది. పలచని ఇంగిలీకపురంగుగల రాళ్లతో నిలివెడెత్తున నిర్మింపబడిన ప్రాకారపుగోడ ఆశ్రమాంతర్వాసులైన మునుల శాటీ ప్రాతినిధ్యం నహించినలాగు గనుపడుతుంది. ప్రాకారపు పూర్వభాగంలోని ముఖద్వారంనుండి తిన్నగా, ఏటవాలుగా దిగి కళ్లేటినీటిమట్టానికి పోయింది అదే రంగు రాళ్ల మెట్లవరస. కర్మసాక్షి బయలువెడలీ వెడలని ప్రాతఃకాలమున, పూర్వదిగరుణమరీచులు ప్రాకారకుడ్య కాంతులతో కరస్పర్శనం చేయునపుడు, వనస్పతుల దివ్యగంధ మానియాని మెల్లగ చల్లగాలి నడయాడునపుడు, ముఖద్వారంమీద ఆసీనులై దృష్టి సారించినయెడల, గడ్డితో, మొక్కలతో, చిన్నచిన్న చెట్లతో, తీగజొంపాలతో నిండి ఏటవాలుగ ఏటిపర్యంతం ప్రసరించిఉన్న పర్వతపార్శ్వాలూ, మెట్లవరసా, కొండ యడుగున కళ్లేరు, దాని కావల చాలదూరంవరకు విస్తరిల్లియున్న చిట్టడవులకొండలూ, కళ్లేటితీరంవెంట వ్యాపించి పైర్లతో నవనవ లాడుతున్న తోటలూ, మొదలైన వన్నీ ఏకీభవించి అతి సుందరమైన దృశ్య మేర్పడి యుండ ఇట్టి సర్వతోముఖ మోహినియగు ప్రకృతిని వదలడం ఏలాగా యని ఆలోచనలు బయలుదేరుతూ ఉంటాయి తత్వవేత్తల మనుకొనే వేదాంతుల నీరసస్వాంతాల్లో కూడా. ఈ నైసర్గిక దివ్య సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తూ ఉంటారు కళ్లేటి నీట జలకమాడి పసుపు రాచిన మొగాలతో, సువ్యక్తాలైన కుంకుమ తిలకాలతో, తడి వెండ్రుకల జారుముళ్లతో, ముతకనాజూకు కట్టుపుట్టాలతో, జలపూర్ణకలశాలతో మెట్ల నెక్కి వచ్చే జవ్వనులు, సంతానవాంఛితలై మునిసందర్శనార్థ మేతెంచిన సుందరులు. నిండుబిందెల నెత్తుకొని ఎక్కలేక ఎక్కలేక మెట్ల నెక్కి వచ్చు సంతానకామినులైన ఈ కోమల శరీ

రల చూచినయెడల, గలుగబోవు సంతానభారవహనాన్ని అభ్యసిస్తున్నారా యనిపిస్తుంది. ఆశ్రమ శరీరానికి ఆత్మకల్పుడైన నృసింహ యోగీంద్రుని ప్రభావమే కావచ్చు' ఆతపోవనంలో సంతృప్తి శాంతి సౌఖ్యాలే కాని తద్వ్యతిరేకాలున్నట్లు గానరాదు. ఏదో కార్యవశాన్ని ఈ యతీంద్రుని సమీపించనివారు, వచ్చి సంపూర్ణకాములై వెళ్లనివారూ ఈప్రాంతాల్లో లేరు. ఆశ్రమంలో వీరు ఉండేది ఒకచిన్న పూరిగుడిసె. లోపల ఒక్క శరీరానికే తప్ప మరోదానికి చోటుండేది కాదు. కాని మంచిభాగ్యవంతులకుగూడా అక్కడ వుండాలెనని మన సౌతూ ఉండేది. దేవాలయపు గర్భగుడిలాగే తోచేది.

ఇట్లు శాంతిసౌఖ్యాలకు ఆకరమైన ఈ తపోవనానికి చేరాడు మన వీరయ్య వేలూరు కేంద్రాగారం నుంచి విడుదల కావడంతోటే, రెండేళ్ల శిక్ష పూర్తిఅయింతర్వాత. స్వంతఇంటికైనా పోలేదు. చింతాపశ్చాత్తాపాలతో నవసి నవసి తుదకు వైరాగ్యంలోబడ్డ ఇతనికి ఇల్లూ, వాకిలీ, ఇష్టమిత్రులు, బంధువులూ ఎవరూ కన్పించారుకారు. పుట్టింట చేరి తనకోసం ఇంతకాలం ఏడుస్తూఉన్న భార్యను జూచి ఓదార్చడానికైనా వెళ్ళక ఈఆశ్రమానికి చేరాడు యతీంద్రుల ఉపదేశాన్ని పొంది సర్వసంగత్యాగియై సన్యాసం గైకొనవలెనని. ఇతని వంటి చిత్తవిక్షేపాలు కలుగు స్వభావుల కందరికీ ఇదే దశ. ఏదివచ్చినా మితిమీరిపోతూ ఉంటుంది. ఆనాడు గంగను తహశీల్ గారికి ముట్టజెప్పాలినని ఎంత ఆత్రం, ఎంత తెగువా, ఎంతపట్టుదలా కలిగాయో అంతకన్న నెక్కువగ ఇప్పుడు సర్వమూ త్యజించి సాధువు కావాలినని కలిగాయి. ఈయోగీంద్రుల సంగతి ఇతనికి చాలా కాలంనుంచే తెలుసు. అందుచేత తిన్నగా ఇక్కడికే వచ్చేడు. వచ్చి రెండురోజులైంది. యోగీశ్వరులతో సంభాషణ జరిగింది. తాను వచ్చినకార్యం విన్నవించుకొన్నాడు. వారూ ఇతని పూర్వోత్తరాలను అన్నింటినీ బాగా అడిగి కనుక్కన్నారు. సరే వుండమన్నారు ఇతనిరోగానికీ చికిత్సచేద్దామనుకొనీ. వీరు సమస్తవిధాలైన రోగాలకూ చికిత్స చేస్తారని ఇదివరకే తెలిపాను కదా!

కాని వీరు మంచి అనుభవంకల వైద్యులు. రోగం ఒకసైతే వైద్య మింకోటి చేసేవారు కారు. త్వరపడేవారు కూడా కారు. ఎటువంటి వైరాగ్యం స్థిరంగా వుండేదీ, ఎటువంటిది ఉండనిదీ వీరికి బాగా తెలుసు. వీరి సంచారకాలంలో కాశీ, ప్రయాగా, గయా, ఇత్యాదిపుణ్యక్షేత్రాల్లో జరుగుతూ ఉండే పితలాటకాలెన్నింటినో చూసేవున్నారు. ఎందరినో ఉభయభ్రష్టులను చూశారు, కానివారిని కాకుండా రక్షించారు. పెండ్లాంతో వేగలేక పారిపోయివచ్చిన విరాగులూ, ఉంచుకొన్నదానిచేత తన్నులు తిని వచ్చిన ఇంద్రియనిగ్రహులు. వ్యాపారాల్లో దివాలాతీసి వచ్చిన నిస్పృహచిత్తులు, వ్యాజ్యాల్లో కట్టకడపటివరకు ఓడిపోయి వచ్చిన నిర్మములు, అధికార్ల చేత తిట్లు దిని పని పోగొట్టుకొని వచ్చిన నిరహంకారులు, వరసాగ్గా పరీక్షల్లో దప్పి వచ్చిన బాలవిరక్తులు, ఇత్యాదు లెందరో వస్తూవుండేవారు చతుర్థాశ్రమ స్వీకారార్థం. గురుపద మధిష్టించియున్న మహాత్ములు, అదివరకున్న శిష్యులు పాతబడి పోవడంచేత ఈ కొత్తగా వచ్చినవారు మళ్లీ కొన్నాళ్లవరకైనా సేవాశుశ్రూషలు తృప్తికరంగా చేస్తారనే యాశతో ఆ వచ్చినవారి జుట్టుపిలకలను కత్తిరించి, కాషాయవసనాల గట్టించి సంతర్పణలతో సహా శిష్యులగావించుకొంటూ ఉండేవారు. కాని యీ నూతనాగతులకు వచ్చిన క్షణమందున్న వైరాగ్యం రెండో క్షణంలో ఉండేది కాదు. కొన్నాళ్లకు పూర్తిగా చల్లబడేడి. అంతవరకూ బాగా నమ్మకం పుట్టేలాగు సేవాశుశ్రూషలను సలుపుతూఉండి తుదకు ఏ అర్ధరాత్రి వేళనో గాఢనిద్రామగ్నులై ఐహికం మరచి మహానందంతో గురువులవారు గురకలుకొట్టుతూ ఉన్న సమయాన్ని వారికి నిద్రాభంగం చేయడం ధర్మం కాకపోవడంచేత గురువుగారితో చెప్పి వారి యాశీర్వాదాలను పొంది బయలుదేరుటకు వలను దొరకదయ్యెగదా యని చింతిస్తూ వారి స్మరణార్థం, వారికి ప్రియమైన వస్తువు లేవైనా లభించేయెడల అనాయాసంగా మోయగలిగినన్ని సంగ్రహించుకొని అంతూ పొంతూ లేకుండా అంతర్ధానమౌతూ ఉంటారు. ఈలాటి

ఆషాఢభూతులను ఎందరినో చూశారు వీరు. అట్టిశిష్య రత్నాలను తలచుకొని తలచుకొని విలపిస్తూఉండే తీర్థ పాదుల నెందరినో ఓదార్చారుకూడా. కాబట్టి వీరికి బాగా అవగతమే ఎట్టివానికి ఎట్టిపరిస్థితుల్లో ఆశ్రమం ఇవ్వవల సిందీనీ.

వీరయ్య వచ్చి మరిరెండు మూడురోజులు గడిచాయి. రోజూ యోగిగారితో మాటలు జరుగుతూనే ఉన్నాయి. ఇతనిపట్టుదలా తగ్గలేదు, స్వాములవారు సుముఖులయ్యేలాగు కన్పించడం లేదు. ఇతన్ని ఈప్రయత్నాన్నుండి తప్పించి ఉచితమార్గంలోకి తేవాలి అని వీరి అభిప్రాయం. ఒకనాడు సాయంకాలమైంది. మరీచిమాలి కొండవెనుకకు పోవడంచేత ఆశ్రమమూ, దాని కిరుప్రక్కలందూ నీడా, ఈనీడ పడని బాహ్యప్రదేశాలన్నీ నీరెండలో మిలమిలలాడుతూ మహాశోభాయమానంగా ఉన్నాయి. నృసింహస్వామి ఆలయానికి ముందున్న వేదికమీద యోగులవా రాసీనులై ఉన్నారు. సేవాసం దర్శనాలకై వచ్చిన యాత్రికు లందరూ చుట్టూ కూర్చొని వారి ఉపదేశం వింటున్నారు. రండి! వారి భవ్యమూర్తిని మీకుకూడా జూపించి వారుపదేశించేదాన్ని వినేలాగు చేస్తాను. ప్రస్తుతం వీరయ్య కేదో చెబుతున్నారు. కాని వారి ఉపదేశం అందరికీ కలిసేవస్తుంది.

అరుగో! వారే యోగీంద్రులు, వేదికపైని కృష్ణాజినంమీద. మేలిమిబంగారంవంటి శరీరచ్ఛాయ. ఏడడుగులకు కొంచెం మించిన ఆజానుబాహుదేహం. దేహప్రమాణదీర్ఘమైన జటాభారం. ఆనందజ్యోతి తొలుకాడు విశాలమైన గుండ్రని మొగమూ. ఆప్రకాశంలో వెలుగొందు ప్రసన్నతాయుక్తమైన దరహాసం దర్శకుల వదనా లన్నింటిమీద సంక్రమించిందా యనునట్లు వారందరుకూడ మందహాసంతో వారిమాటలను వింటున్నారు. కాని సంభాషణలోని సందర్భాలు ఒక్కొక్కప్పుడు వీరిముఖభావాలను మారుస్తున్నాయి. వినండి! మీరు కూడా.

యోగి:—వీరయ్యా! నేనిన్నాళ్లనుంచీ చెబుతూవచ్చినమాట లింకా నీమనస్సున కెక్కినలాగు లేదు.

వీర:—స్వామీ! నాఈవైరాగ్యం స్థిరంగా ఉండజాలదనేనా తమ యనుమానం?

యోగి:—స్థిరంగా ఉండడం, ఉండక పోవడమూ మూడు నాలుగురోజుల్లో కాదుగదా మూడు నాలుగు ఏండ్లలోగూడా తేలేవిషయం కాదు. దాన్నిగురించి నేను ప్రస్తాపించ దలచుకోనే లేదు.

వీర:—అయితే నిన్నరాత్రి తమరు సెలవిచ్చిన విషయాలా నాయాశ్రమ గ్రహణానికి అభ్యంతరాలు?

యోగి:—అవును. సన్యాసం తీసుకోడానికి ముందు నీమీద కర్తవ్యాలెన్నో వున్నాయి. ఇదివరకు నీయంతట నీవే వాటిని మీద వేసుకొన్నావు. ఇప్పుడు వాటినుండి తప్పించుకోడం నీశక్యంకాదు. పూర్వకర్తవ్యపాలనాన్ని అసంపూర్తిగా వదలి ఇంకో కర్తవ్యభారం మీద వేసుకోడానికి యోచిస్తూ ఉన్నావు. తుదకు అటూ ఇటూ కాకుండా ఉభయభ్రష్టుడవై పోవడం తప్ప ఇంకేమీ లభింపదు.

వీర:—స్వామీ, స్వార్థంచేతనో అహంకారంచేతనో లేక నా దౌర్భాగ్యంచేతనో అపరాధం చేశాను. అందుమూలాన్ని పోయిన ప్రాణాలు పోగా నిర్దోషులైన వారి సంసారం నీట కలిసింది. ఇక నాకు మాత్రం సంసార మెందుకని చింతావిరక్తులతో మీపాదాలను ఆశ్రయించాను. కాబట్టి నా హృదయతాపం బోయి శాంతి గలిగే మార్గ మేదో తమరే సెలవియ్యండి!

యోగి:—నా అభిప్రాయమూ అదే. నిన్ను కర్తవ్యచ్యుతుని చేయకుండా నీమనస్సుకు శాంతి కలిగే ఉపాయం చేద్దామనే. అన్యథా నీవు అడగడంతోనే ఇచ్చేవాడిని నీకాశ్రమం. గుడ్డలరంగు మార్చుకొని కర్తవ్యహీనులై ఒకమూలనుజేరి రామరామ అని జపిస్తూ కూర్చున్న మాత్రాన ముక్తీ లభించదు, శాంతీ లభించదు. కాని ఫలాపేక్ష లేకుండా స్వకర్తవ్యం నిర్వహించుకొంటూ వుంటేనే నీ కేమైనా ప్రాప్తించేది. వీరయ్యా, ఎప్పటికైనా జైలునుంచి విడుదలను పొంది వస్తావనే ఆశతో ఇంతవరకూ నీకోసం ఏడుస్తూ ఎదురుచూస్తూ ఉన్న నీభార్య నీయాశ్రమస్వీకారం వినంగానే

ఏమవుతుంది? ఆమెయొక్క ఒక్క కన్నీటిబొట్టు చాలు నీతపోగ్నినంతా చల్లార్చడానికి. ఆమె ఒక్క ఉష్ణనిశ్వాసంచాలదూ నీశాంతిసాగరాన్నంతా పీల్చడానికి? నీసహధర్మచారిణి, నీయర్ధాంగియైన ఆమె యక్కడ నవసి నవసి ఆత్మహత్యకోసం ప్రయత్నం చేయడం, నీ విక్కడ ఆత్మలబ్ధికోసం ప్రయత్నించడమూనా! వహవ్వా! ఎంతసరసంగా ఉంది! ఎవరి కర్మను వారే భోక్తలని సరిపెట్టుకొనడానికి వీల్లేదు. అనేకచోట్ల పరస్పరాకాంక్ష ఉంటుంది. నీవల్ల ఇదివరకు మహాపరాధం జరిగిందంటే దాంతో ప్రతితూగగల ఉపకారాన్ని చేయి వెంకయ్యకుటుంబానికి. అందువలన నీకు శాంతికలుగుతుంది కాని ముక్కు మూసుకొని కూర్చుంటే కాదు. ఇదివరకు నీవు చేసినదానివల్ల హాని కలిగింది ఒక్క కుటుంబానికే. ఇంకోదానికి చేయడానికి సిద్ధపడుతున్నావు ఇపుడు. అది నీకుటుంబానికే.

వీర:—స్వామీ, నా కేమీ పాలుపోవడంలేదు. ఇక తమరే సెలవియ్యండి, నే నేం చేయవలసిందీ!

యోగి:— రేపు ఉదయాన్నే లేచి మొదలు మీ యత్తగారి ఊరికి వెళ్లు. నీ భార్యను కలుసుకొని మంచీచెడ్డా విచారించుకో. నీకు వెంకయ్యావాళ్లను చూచి నీపశ్చాత్తాపాన్ని తెలియపరచాలని ఉంది కాదూ? ఒక వారంరోజులు గడచింతర్వాత బయలుదేరు, వాళ్ల క్షేమ సమాచారాలు తెలుసుకొని చూడడానికి. అరుగో ఒక గంటక్రిందే వచ్చారు ఇద్దరుముగ్గురు మనుష్యులు, స్వామి దర్శనానికి ముడివేములనుంచి. వాళ్లనడిగితే తెలుస్తుందనుకొంటాను, వాళ్ల సంగతి చాలవరకూ......ఏం రామయ్యా! మీ కేమైన తెలుసా, మీవూరి వెంకయ్య ఎక్కడ ఉందీ, ఏం చేస్తూ ఉందీనీ?

రామయ్య:— చిత్తం; వచ్చిపోయ్యేవాళ్లవల్ల ఇప్పుడు వాళ్లపని ఒకమాదిరిగా బాగానే ఉందని విన్నాను. తెనాలిలో ఉన్నారట. ఇద్దరూ వొళ్లు వంచి పాటుపడేవాళ్లు. ఇంతకూ భగవంతు డనుగ్రహించాలె. మళ్లీ ఆ దంపతుల కొక కొడుకు కలిగాడనీ, అచ్చంగా పోయినవాడిలాగనే వుండడంచేత వీడికీ వాడిపేరే పెట్టుకొన్నారనీ, ఇందువల్ల వాళ్లకు చాలావరకు బెంగ తీరిందనీ చెప్పారు, నాలుగైదు నెలల క్రిందట వచ్చిపోయినవాళ్లు. ఇటువేపునకు ఒకపర్యాయం వచ్చిపోవాలని అనుకొంటున్నలాగు విన్నాం.

యోగి:—వింటున్నావా? వీరయ్యా!

వీరయ్య:— చిత్తం. మీ రానతి ఇచ్చినలాగు నడుచుకోవడానికి రేపు పొద్దున్నే వెళ్లిపోతాను. సెలవిప్పించండి!

యోగి—మంచిది.

౫

ప్రస్తుతం మన కథాభాగానికి రంగభూమి, నూపాటిసీమలోని గంగాయమునల మధ్యఉన్న ఈపుణ్యభూమి. పుణ్యజనావాసమై ఉండేదని—శూర్పణఖ తాలూకు రాజ్యం కావడంవల్ల మొదటిభాగంలో సూచించే ఉన్నాను. ఆ త్రేతాయుగంనాటి ఖరదూషణాదుల, వారి యనుచరుల సంతతులేమో యను సందేహం కలుగుతూ ఉంటుంది, ఇప్పుడీ కలియుగంలో అదేవిధంగా రాక్షసపరిపాలనం సాగిస్తూఉన్న ఎరకల మూకలను చూస్తే, యానాది చెంచుగుంపుల జూస్తేను. చివరరెండు జాతులవారివలన ఉపద్రవా లేమీ అట్టే ఎక్కువగా జరుగుతూ ఉండవు కాని పూర్వుల పేరును అక్షరశా నిలిపేది ఎరకలగుంపులు. దార్లు గొట్టి దోచుకోడంలో వీరిది పెట్టింది పేరు. వీరీప్రాంతాలను ప్రధాననివాసంగా ఏర్పరచుకొని వందవంద మైళ్లకుపైగా దోపిళ్లుకొడుతూ ఉంటారు. ప్రధానావాసంలోగూడా ముఠాలు ముఠాలుగా జేరి సామాన్యంగా అందరికీ ఎరుకపడని మారుమూల ప్రదేశాల్లో, కొండచరియల్లో, పర్వతాలమధ్య అగాధంగా కోసుకొనిపోయి పారుతూఉన్న నదుల తీరాల్లో విడుదులను స్థాపించుకొని వానికి చుట్టుప్రక్కల ౧౦, ౧౨ మైళ్ల వలయంలో ప్రయాణాలను సలిపే బాటసార్లకు మహోత్సవవిఘ్నులను గావించి ప్రయాణపు గమనపరిశ్రమానికి తోడు వేరొండు భారవహన ప్రయాస మేమీ లేకుండజేసి సాగనంపి వారి యాశీర్వాదాలను పొందుతూ ఉంటారు. గమనాగమనాలకు

తగిన రోడ్లేవీ లేకపోవడంచేత, వీళ్ల ఆటలన్నీ సాగి వస్తున్నాయి. సర్కారువారు ఏం నిద్రపోతున్నారా అంటారేమో! లేదు, లేదు. వారు వీళ్లను పట్టుకోడానికి శతవిధాలప్రయత్నంచేస్తూ ఉంటారు. కాని కృతకృత్యులు కావడంలేదు. సర్కారు గుప్తచారుల క్రిమింగిన రహస్య చారులు వీళ్లదగ్గర ఉన్నారేమో తెలీయదు. పోలీసు వారిగస్తీలూ, వారిశోధనలూ ఎక్కువైతే కాని, లేక చురుకుగా జరుగుతూ ఉంటే కాని వెంటనే ఈ గుంపులు మాయమౌతాయి. ఎక్కడ దాగుతాయో తెలియదు. సర్కారుప్రయత్నాలు జారీలో ఉన్నంతకాలమూ వీళ్ల పొడకువ కూడా కానరాదు. ఆరోజుల్లో జనుల రాక పోకలు నిర్భయంగా జరుగుతూ ఉంటాయి. కాని ఎన్నాళ్లనీ ద్రవ్యాన్ని దుబారా చేసుకోడం సర్కారు వారికి ఈవెట్టిగోలవుకోసం? కొన్ని నెలలు గడచిం తర్వాత ఈశోధనాలు తగ్గుతాయి. వెంటనే వీళ్ల పోళ్లూ యథాప్రకారం విజృంభిస్తాయి. ఆకొండ బోడెమీద కోమటికోటయ్యకు పూజ బాగా జరిగించారనీ ఎరక లోళ్లు, ఈడొంకలో బత్తుల మల్లయ్యను బహుదివ్యంగా సత్కరించారనీ గ్రామాల్లో ముచ్చటగా చెప్పుకొంటూ ఉంటారు. ఈరోజుల్లోనే రెవిన్యూ అధికారులు, ఫారెస్టు ఆబ్కారీ సిపాహీలూ, సూపర్వైజర్లు, సెటిల్ మెంటు ఆఫీసర్లు ఎందరో సర్కారు ఉద్యోగులు వస్తూ పోతూనే వుంటారు. కాని సర్కారునౌకర్లు కొద్ది మందైనా సరే, ఒంటరిగాడైనాసరే, దగ్గర ద్రవ్యమున్నా సరే, వాళ్లజోలి కెంతమాత్రం పోరు వీళ్లు. మళ్లీ ఊపిరి తిరక్కుండా చేస్తారనేభయమే కాబోలు?

దొరతనపు నౌకర్లని వీళ్లు ఏప్రకారం గుర్తిస్తారో ఇది మహావిచిత్రమైన సంగతి. డ్రెస్సుమీద ఉన్నా సరే, వ్రైడెస్సు అయినా సరే సర్కారుమనిషి కంటపడడం తోటే వీళ్లు కాళ్లకు బుద్ధిచెబుతారు. అదివర కేమైనా చేతజిక్కి ఉంటే దాన్నికూడా ఆవతల పారేసి పలా యనం గావిస్తూవుంటారు.

కురిచేడు రైల్వేస్టేషనుకు ఎదురుగా ఉన్న చిట్టెపు కొండలవరుసలకు అవతలిప్రక్క అనగా గుండ కమ్మ పారేవేపున ఈదోపిడిగాండ్ర గుంపులకు నిల్వ డాని కనుకూలామైన మారుమూలప్రదేశాలు కొన్ని ఉన్నాయి. వాటిలో తంగిరాలకొండ క్రింద వాగులోని ప్రదేశం ఒకటే. ఇది చాలా భయంకరమైంది. అక్కడ పడివుంది ఒక ఎరకలగుంపు. కురిచేటిస్టేషన్నుంచే గాక గుండ్లకమ్మ స్టేషన్నుంచి కూడా ఒక డొంకబాట పోతుంది ముడివేములకు. ఈదారికీ ఎరకలగుంపు పడివున్న చోటికీ ఒకమైలు వ్యవధానం ఉండవచ్చు. ఈదారి దక్షిణపూర్వాన్నుంచి బయలుదేరి ఉత్తర పశ్చిమంగా పోతూ మధ్య తగిలేకొండను ఎక్కి దిగిన వెంటనే గుండ్ల కమ్మనుదాటి ముందుకు సాగిపోతుంది. కొండానదీ కలసిన చోట ప్రవాహపుకోతవలన ఒక మరుగుమూల ఏర్పడి ఉంది. ఈమూల యందే సమయం కనిపెట్టి యుండి దోపిడిగాండ్రు ఆదారిని వచ్చిపొయ్యేవారికి వసంతోత్స వాలు జరిగించి కీర్తి గడిస్తూ ఉంటారు. అట్టి ఈప్రదే శంలో తాము విన్న నిర్భాగ్యు లెప్పుడు దటస్థపడు తారా యనే యాశతో గూబల్లాగు కనిపెట్టుకొని కూర్చున్నారు, దారికి కొన్నిగజాల దూరంలో, మీద చెప్పిన ముఠాకు జెందిన నలుగురు మనుష్యులు, ఒక పెద్ద చాపరాతిని చాటు జేసుకొని.

బెజవాడ వేపునుంచి గుండ్లకమ్మస్టేషనుకు సాధా రణంగా మూడు రైలుబండ్లు నడుస్తూవుంటాయి. రాత్రి సుమారు ౧౧ గంటలకు ఒకటీ, తెల్లవారుజామున ౪ గంటలకు ఒకటీ, పట్టపగలు ఒంటిగంటకు ఒకటినీ. సరియైన రోడ్లు లేని అడవిమార్గం కావడంచేతా, దొంగల భయంచేతా, సామాన్యంగా పగటిబండినుంచే దిగుతూ ఉంటారు ప్రయాణీకులు. విధి లేక రాత్రి దిగినవాళ్లు తెల్లవారేవరకు స్టేషన్దగ్గరే గడపి తరువాత బయలుదేరు తారు వారివారి గ్రామాలకు. ఒంటిగంటబండి వెళ్లి పోయి రెండు గంటలు గడిచాయి. ఇంతవరకు తాము కని పెట్టుకొనివున్న వాళ్లు రాలేదేమని చాలా తహతహపడు తున్నారు బండ్లచాటుదొంగలు.

జీవులంటే అపారమైన దయ భగవంతుడికి. భూతంమీద క్షణక్షణానికీ ఒక్కొక్క మరపుతెర కప్పుతూ ఉంటాడు. భావిమీద అజ్ఞానమనే లోహపు

కేవల దొంతర పడేవుంది. ఈవిస్మరణాజ్ఞానమధ్యగత రంగభూముల్లో ఎన్నినృత్యాలైనా తొక్కిస్తూఉంటాడు జీవులచేత. ముందూ వెనుకా ఈ తెరలే లేకపోతే జీవుడి గతి ఏమయ్యేదో తెలియదు. జీవుడిగతి కేమిటి గాని సర్వజ్ఞత్వ దయాసముద్రత్వ ధర్మాలను రెంటినీ కోల్పోయే వాడేమో అనిపిస్తుంది ఈశ్వరుడీ రెండు తెరలనూ గల్పించకపోయినట్లయితే.

ఉత్తరక్షణంలో జరిగే మహా భయంకరఘటనాల జ్ఞానం లేశమాత్రమైనా లేకపోవడంచేతనే కేలింతలు కొడుతూ ఉంటాం సంతోషసాగరతరంగాల్లో, వొళ్లూ పై తెలియకుండా. రోడ్డుప్రక్కన ఉంది ఒక పెద్దమర్రిచెట్టు. దాని క్రిందుగా వస్తున్నాడు ఒక యువకుడు. ముందడుగు వెయ్యడంతోటే నెత్తిమీద పడడానికి సిద్ధంగా ఉంది ఒకపెద్దకొమ్మ. కాని ఎదురుగుండా వస్తున్న ఒకసుందర పదార్థంమీద వ్రాలి ఈతని మనోరాజహంసి ఆనందసరసిలో తేలియాడుతూ ఉంది. ముందడుగు వెయ్యడం, ఫెళ్లున కొమ్మ పడడం, గుభిల్లున నేల గూలడం, నెత్తి చితకడం, స్మృతి తప్పడం యువకునికి అన్నీ క్షణంలో జరిగాయి. గిండీరేసుల్లో రెండు లక్షలపందెం గెలిచిన ఒక శ్రీమంతకుమారుడు ఫోర్డుకారెక్కి మనోవేగంతో ఆనందపరవశుడై జార్జిటవునుకు వస్తూ తనవాళ్లందరికీ ఈసంతోషవార్తను తెలియచేయడానికి బొసాట్టో హోటలుముందు ఛాంపేన్ ఎగిరేదు, ఇంకోకారుతో ఇతనికారు ఢీకొనడంచేత. లక్షలు దొరుకుతాయి ఈలాటి దృష్టాంతాలు.

బండచాటున నల్గురుదొంగలూ మహా ఆత్రంతో పొంచేసుకొని కూర్చున్నారు. స్టేషన్ వేపునుంచి నడిచి వస్తున్నారు ముగ్గురు ప్రయాణీకులు. వెంకయ్యా, వెంకమ్మా, దారిలో కలిసిన మరోబాటసారీ. మోకాళ్లపైకి లాగికట్టిన ముతకధోవతీ, నెత్తిమీద పాగా, వంటిమీద ఉత్తరీయం; మూట తగిలించిన బాణాకర్రను బుజంమీద వేసుకొని మాట్లాడుతూ నడుస్తున్నాడు వెంకయ్య. అతని ప్రక్కనే వస్తున్నాడు బాటసారి. ఇతనివేషమూ ఇంచుమించుగా అదేమాదిరిగ ఉంది కాని, ఇతనివద్ద మూటా ముల్లే ఏమీ లేదు. ఇతనిచెప్పులు మాత్రం కర్రకు తగిలించి వున్నాయి. వీళ్ళవెనక ఒక బారెడు దూరంలో వస్తున్నది వెంకమ్మ. చేతులో ఏడెనిమిది నెలల పిల్లవాడున్నాడు. వాడి లేతవంటిమీద కొన్ని వెండిసొమ్ములున్నాయి. వుర్రవాడి పాలబుగ్గలను వేళ్లతో బుణుకుతూ, ముద్దులాడుతూ, వాడి బాల్యచేష్టలకు అపారమైన ఆనందంపొందుతూ నడుస్తున్నది వెంకమ్మ. ఇందువలన ఈమెకు నడకవలని ఆయాసంకూడా కన్పించడంలేదు. ఇంకో గంటలో మామిడివేములలో మాయింట్లో వుంటామని అత్యంతమైన సంతోషం వీళ్ల మొగాలమీద నాట్యం చేస్తూ ఉంది. రెండేళ్లు గడిచిపోయింతర్వాత మళ్లీ స్వంత ఇంటికి వెళ్లుతున్నాంగదా యని ఒకవిధమైన ఉత్కంఠా, ఒకవిధమైన ఆందోళనం వీళ్లహృదయాల్లో పొంగి పొరలుతున్నాయి. ఒక్కొక్కప్పుడు కళ్లనీళ్లు కారుతున్నాయి, ఎన్నాళ్లకు మాయీప్రాంతాలను చూడగలిగేమనీ. గుండ్లకమ్మను ఎప్పుడు దాటుతామా అని త్వరత్వరగా నడచి వస్తున్నారు. ఆహా! ఎంతప్రేమా స్వంత ఇల్లంటే.

సుమారు మూడుగంటలు దాటుండవచ్చు. దొంగలు కూచున్న రాతికి తిన్నగా వీళ్లు పదిగజాలదూరంలోకి వచ్చేసరికి దానిచాటునుంచి వీళ్లమీద రంయిరంయిమని రాళ్లు పడ్డాయి. ఏదిక్కునుంచి పడ్డాయో అని వీళ్లు ఇటూ అటూ దిగ్భ్రమతో చూస్తూ నిలుచోనే ఉన్నారు. అప్పపాటుకాలంలో ఇద్దరు దొంగలు వీళ్ల ముందుకూ, ఇద్దరు దొంగలు వీళ్లవెనుకకూ దూకి దారిని అడ్డకట్టారు. వెంకమ్మకు వొళ్లు ఝుల్లుమని గాభరా పుట్టి ఏముయిందీ తెలియడంలేదు. ఆపాదమస్తకమూ గజగజ వణకుతూ ఉంది. చెమ్మటలు పోస్తున్నాయి. బిడ్డను గొమ్మున కదుముకొని ఓవారా ఓవీరా యని అరవబోతుంది కాని భయంచేత నోరు ఎండి మాట బాగా పెగలడంలేదు. వెంకయ్య క్షణమాత్రంలో భయంకరంగా మారిపోయి ముందు దూకిన ఇద్దరి మీదా తిరగబడ్డాడు బాణాకర్రతో, మూటను క్రింద పారేసి. బాటసారి వెనుకవాళ్లతో తలపడ్డాడు. కటాకట్ కర్ర లెగు

తున్నాయి. దెబ్బలు తగులుతున్నాయి. ఒక్కొక్క దెబ్బ తగిలినకొలదీ ఆవేశం ఎక్కువై పోతుంది. వెనుక దొంగల్లో ఒకడు వెంకమ్మమీదికి దూకి బిడ్డను బలవంతాన లాగుతున్నాడు. అయ్యో! అయ్యో! నాబిడ్డను కాపాడండి నాయనా! అని ఏడుస్తూ దొంగతో పెనగులాడుతూ ఉంది ఈమె. వెంకయ్య, బాటసారీ, వాళ్ల దెబ్బలను తప్పించుకొంటూ ఈమెకేసి తిరిగారు. కాని ఇంతలో ఆరాక్షసుడు పిల్లవాణ్ణి లాక్కొని పరుగెత్తడం మొదలెట్టాడు, గొంతు నులిమి చంపడానికో లేక నీళ్ళలో ముంచడానికో. ఈమె నెత్తీ రొమ్మూ కొట్టుకొంటూ వాడివెంటబడి రవంతదూరం పరుగెత్తి క్రింద పడిపోయింది. మూట నెత్తుకొన్నాడు మరోదొంగ. తక్కిన ఇద్దరూ వెంకయ్యను, బాటసారినీ కదలనివ్వడం లేదు. ఇంకో క్షణం దాటితే ఏమయ్యేదో తెలియదు, ఇట్లే సాగివుంటే. కాని "ఖబర్‌దార్ బద్మాష్" అని సింహగర్జనం చేస్తూ, చేతిలోని బాణాను ఝుళిపిస్తూ! పరుగెత్తుకొని వచ్చి హఠాత్తుగా రంగంమధ్య నిలిచేడు ఒక క్రొత్త మనిషి. స్తంభించి పోయినారు ఎక్కడివా ళ్ళక్కడ మంత్రముగ్ధుల్లాగు. వెంకయ్యను బాటసారినీ కదలనీకుండా చేస్తున్నదొంగ లిద్దరూ పోరాటం మాని కొండమీది కడ్డంపడి పరుగెత్తారు. మూటవాడు మూటను వదలి అదే పరుగు. కొత్తమనిషి పిల్లవానితో పరుగెత్తుతున్న దొంగవెంట బడ్డాడు. వాడదిచూచి కుర్రవాణ్ణక్కడే పారేసి మరోవేపునకు పరుగెత్తాడు. క్షణంలో పటపరివర్తనమై రంగం మారిపోయింది. వెంకమ్మ ఇంకా క్రిందనే పడివుంది. వెంకయ్యకూ బాటసారికీ దిగ్భ్రమ విస్మయంవల్ల నోటివెంట మాట రావడంలేదు. కొత్తమనిషి పిల్లవాణ్ణి చేతుల్లోకి దీసుకొన్నాడు. తల్లిదగ్గరనుంచి లాక్కోడంలో కొంచెం వొళ్లు నలిగి, క్రింద పడేసినప్పుడు కొంచెం దెబ్బ తగలడం తప్ప పిల్లవాడి కేమీ అపాయం కలుగలేదు. కాని తెగ ఏడుస్తున్నాడు. వీణ్ణి దగ్గరికి తీసికొనిరాగానే వీడి ఏడుపు విని తెప్పిరిల్లి లేచింది వెంకమ్మ. కొత్తమనిషి వాణ్ణి ఆమెచేతులకు అందిచ్చేడు. మా అయ్యా, బతికున్నావా మానాయనా? ఏదేవుడు బతికించేడు తండ్రీ! అని వాణ్ణి అక్కునకు అదుముకొని వొళ్లంతా నిమురుతూ ఏడుస్తూ కూర్చుంది......

పిల్లవాణ్ణి యమదూతచేతుల్లోనుంచి లాక్కొని వచ్చి తల్లిచేతుల కందిచ్చిన ఈక్రొత్తమనిషి ఎవరో గ్రహించారా? మన వీరయ్యే. యోగిగారితో చెప్పి వచ్చిన లాగు ఇతడు తన యత్తింట వారంరోజులు గడపి బయలుదేరాడు, తెనాలి కెళ్లి వెంకయ్యావాళ్లను కలుసుకొని పరామర్శించడానికి. దారిలోనే ఈప్రకారం సమావేశమైంది.

---

## పాత పాటలు

నేదూరి గంగాధరం గారు

పూసపాటివారు పుణ్యమంతులు
పులి జంపి పులిగోళ్లు జూదమాడేరు
మమ్ము గన్నవారు భాగ్యవంతులు
పల్లేన ధనమోసి పంతమాడేరు.

బిడ్డలు లేనివారు గొడ్డుమోతువారు
చేసే దంతర్వేది గంగస్నానాలు
గంగస్నానము చేసి గట్టుపై కెక్కి
యెదురున్న సూర్యున కేమని మ్రొక్కె
సూరన్న నీవంటి శుభకరు నిమ్ము
చంద్రన్న నీవంటి యింద్రుని యిమ్ము.

మాయ లేళ్లు గలవు ఆలంకలోను
మాకు తమ్ములు గలరు వియ్యమంద.